MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి :19 సంచిక: 12 రంగారెడ్డి ఆగస్ట్ 2021 పేజీలు : 36 వెల : రూ. 10/-

## ఏపిమాస్ 20 వ వార్షికోత్సవ సంరంభం !



జ్యోతి ప్రజ్వలన ; శ్రీ సి ఎస్ రెడ్డి, శ్రీ మధుమూర్తి ప్రభృతులు



మహిళా సాధికారత పత్రికతో డాక్టర్ చంద్రశేఖర్ ప్రయోగ విన్యాసం

## అభినందనలు , ఆశీస్సులు !



తెలంగాణా వ్యవసాయ మంత్రి శ్రీ ఎస్ నిరంజన్ రెడ్డి



తెలంగాణా గవర్నర్ శ్రీమతి తమిళిసై సౌందరరాజన్



నాబార్డ్ ఛైర్మన్ డాక్టర్ జి ఆర్ చింతల



శ్రీ మల్లారెడ్డి ఎకాలజీసెంటర్



శ్రీ సతీష్ సాధన్



శ్రీ శ్రీరామ్ ప్రొఫెసర్



శ్రీ కె రవీందర్ రావు ఛైర్మన్ ఎస్ ఎఫ్ ఎస్ సి బి



యాండ్రియస్ కేపస్ డి జి ఆర్ వి-జర్మనీ,



ఫ్లెచర్ పి డి - కెనడా




డెబీ



హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఏపిమాస్ 20 వ వార్షికోత్సవ సందర్భంగా గ్రూప్ ఫోటో

NABARD

నాబార్డ్ సౌజన్యంతో


नाबार्ड
అభివృద్ధి
కోసం
పారిశుధ్యం
నాబార్డు సౌజన్యంతో
చిరు ప్రయత్నం, గొప్ప ప్రగతి
స్వచ్ఛత ఉద్యమం
బహిరంగంగా బహిర్భూమికి వెళ్ళడం సరికాదు
మీ ఇంటి లోపల మరుగుదొడ్డి నిర్మాణం మంచి పరిష్కారం
गाँव बढ़े >> तो देश बढ़े
www.nabard.org
YouTube /nabardonline
Taking Rural India >>Forward

మహిళా సాధికారత


సంపుటి 19 సంచిక 12



సంపాదకీయం

# శుభం !

**ఆ**శించినదే జరిగింది. భారత సహకార రంగానికి ఎదురైన పెనుముప్పు తప్పింది. మనదేశంలోని సహకార సంస్థలను నిర్వీర్యంచేసి, కేంద్ర ప్రభుత్వంచేతిలో ఆటబొమ్మలుగా మార్చడానికి 97 వ రాజ్యాంగ సవరణ రూపంలో జరిగిన దుస్తంత్రం పారకుండా సుప్రీం కోర్టు అడ్డుకోవడం ఎంతైనా సంతోషించవలసిన విషయం. 97 వ రాజ్యాంగ సవరణ చట్టంలో సహకార సంఘాలకు సంబంధించిన అంశాన్ని సుప్రీంకోర్టు ఇటీవల కొట్టివేసింది. ఇందుకు సంబంధించి గతంలో గుజరాత్ హైకోర్టు యిచ్చిన ఇదే రకమైన తీర్పు చెల్లుబాటును సవాలుచేస్తూ కేంద్రప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం త్రోసిపుచ్చింది. గుజరాత్ హైకోర్టు తీర్పు చెల్లుబాటవుతుందని తేల్చి చెప్పింది. కేవలం ఒకే రాష్ట్రంలో పనిచేసే సహకార సంస్థలపై రాష్ట్ర శాసనసభలు, ఒకటి కంటె ఎక్కువ రాష్ట్రాలలో పనిచేసే సహకార సంస్థలపై పార్లమెంటు శాసనాలు చేస్తాయని 97 వ రాజ్యాంగ సవరణ చట్టం నిర్దేశిస్తున్నది. సహకార సంస్థల ఏర్పాటు, నియంత్రణ, మూసివేయడం, సభ్యత్వం, పదవీకాలం, ఆడిట్, నిర్ణీత వ్యవధిలో నివేదికల సమర్పణ మొదలైన అన్ని అంశాలు ఎలా వుండాలో ఈ చట్టాలు నిర్దేశిస్తాయి. అంటే సహకార సంస్థలలో వాటి సభ్యులు, , పాలకవర్గం ప్రమేయం ఏమీ వుండదన్నమాట ! ఇది సహకార స్ఫూర్తికి తూట్లు పొడవడమే కదా! సహకార సంస్థలు ఎటువంటి వెలుపలి శక్తుల ప్రమేయం లేకుండా కేవలం ఆ సంస్థల సభ్యుల స్వయం నిర్వహణ, స్వావలంబన, స్వయం నియంత్రణతో నడవాలని ఆకాంక్షించే ఏపిమాస్, మరికొన్ని యితర ప్రజా సంస్థలు 97 వ రాజ్యాంగ సవరణను కొట్టివేయాలని వివిధ రాష్ట్రాల హైకోర్టులలో ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను దాఖలు చేశాయి. సభ్యులలో స్వయంశక్తిని ప్రేరేపించే సహకార సంస్థలే పరాధీనంగా, ప్రభుత్వాల చెప్పుచేతలలో నడవాలంటే ఇక పరస్పర సహకారమనేదే నేతిబీరకాయలో నెయ్యి లాగా మారిపోదా? సహకార సంస్థల వ్యవహారం రాజ్యాంగరీత్యా రాష్ట్రాలకు చెందిన అంశమని, అందువల్ల పార్లమెంటు ఈ వ్యవహారంలో చట్టాలను రూపొందించలేదని గుజరాత్ హైకోర్టు ఈ చట్టాన్ని కొట్టివేసింది. సహకార సంస్థల వ్యవహారం కేవలం రాష్ట్రాలకు సంబంధించిన అంశమనే మాట సరైనదేననీ, అందువల్ల ఆ తీర్పు చెల్లుబాటవుతుందని సుప్రీంకోర్టు యిప్పుడు తేల్చి చెప్పడంతో సహకార సంస్థలకు పట్టిన గ్రహణం తొలగిపోయింది. పార్లమెంటు 2011 డిసెంబర్‌లో ఈ రాజ్యాంగ సవరణ చట్టాన్ని తీసుకుని వచ్చింది. అది 2012 ఫిబ్రవరి 15 వ తేదీనుంచి అమలులోకి వచ్చింది. సహకార సంస్థలు సభ్యుల సంఘటిత స్వయంశక్తితో ఏర్పాటై, స్వయంనియంత్రణతో, స్వావలంబనతో పనిచేయాలన్నది సహకార రంగానికి సంబంధించిన అసలైన స్ఫూర్తి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వాలు ఆ స్ఫూర్తికి తూట్లుపొడుస్తూ, ఏదో వంకతో సహకార సంస్థలను మూసివేయించి, వాటి ఆస్తులను కబళించాలని పన్నాగాలు పన్నుతుంటే, ఆ దురాలోచనలను తలదన్నే విధంగా కేంద్రప్రభుత్వం పార్లమెంటు ముసుగులో సహకార సంస్థలపై సర్వాధిపత్యాన్ని చెలాయించాలని చట్టం తీసుకురావడం నైతికంగా ఎంతమాత్రం సమర్థనీయం కాదు. ఇప్పుడు ఆ చట్టం న్యాయ పరంగా కూడా సమర్థనీయం కాదని సుప్రీంకోర్టు నిర్ధారించింది. అయితే, ఇంతమాత్రాన ముప్పు పూర్తిగా తొలగిపోయిందని చెప్పలేము. మళ్ళీ ఏదో ఒక రూపంలో సహకార వ్యవస్థను తమ చెప్పుచేతలలోకి తీసుకునే చట్టాలను అటు కేంద్రప్రభుత్వమో, ఇటు రాష్ట్రప్రభుత్వాలో తీసుకురావని నమ్మకం ఏమీ లేదు. అందువల్ల సహకార సంస్థలు నిత్యం అప్రమత్తతో, మరింత సమైక్య భావనతో మెలగుతూ సంస్థలను సంరక్షించుకోవడం అవసరం.



Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:**T.**Chandra Sekhar Reddy**

**మానవ సంబంధాలను డబ్బుతో కొలవలేం ; ఆత్మీయమైన అనుబంధం ఎంత డబ్బుకు దొరుకుతుంది?**

# మహిళా సాధికారత


ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి : ఏ. కళామణి, ఎస్. రామలక్ష్మి, ఎన్.వినాయకరెడ్డి, బి.వెంకటేశ్వర్లు

కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి కన్సల్టెంట్ : కె.రఘురామరాజు


## లోపలి పేజీలలో ....


- ఆశలను పెంచిన 20 వ వార్షికోత్సవం ...05
- పాత పత్రికలతో సరికొత్త వైజ్ఞానిక సందేశం ...08
- కరోనా బాధితులకు 'ఆజీవ' పౌష్టికాహారం ! ...09
- ఏపిమాస్ కార్యక్రమాల కూడలిగా చిత్తూరు! ...11
- సూళ్ళూరుపేటలో క్లాప్ శిక్షణ కార్యక్రమం ...15
- సర్పంచ్ పదవికి ఉపకరిస్తున్న ఎఫ్‌పిసి శిక్షణ ...16
- మద్యమే గృహహింసలో ప్రధాన విలన్ ! ...18
- చిటికెలో సన్నజీవాలను చంపే చిటుకు రోగం! ...20
- సులువైన ఆదాయమార్గం కోళ్ళ పెంపకం ! ...23
- రక్తహీనతను అధిగమించడం ఎలా? ...24
- స్వయం నియంత్రణ సాధిస్తున్న సుస్థిరాభివృద్ధి ...26
- మహిళా రైతులకు 'ధీశాలి' ధీమా, 'ఆజీవ' అండ ...28
- సుబాబుల్ సాగులో మెళకువలు ...30
- దివ్యాంగులకు చక్రాల కుర్చీలు, టాబ్లెట్లు ...32
- మూడు అమృతాలతో సాగే ప్రకృతి వ్యవసాయం ...33
- ఉమ్మడి పౌర స్మృతి అవసరం: ఢిల్లీ హైకోర్టు ...34



**గమనిక :** 'మహిళా సాధికారత' అనంతమైన భిన్నత్వం నుంచి ఆవహమైన ఏకత్వానికి వేదిక. ఈ పత్రికలో ప్రచురించే రచనలలో వ్యక్తమయ్యే అభిప్రాయాలు పత్రికా నిర్వాహకుల అభిప్రాయాలు కాకపోవచ్చు.


### 'మహిళాభివృద్ధి సొసైటీ' (మాస్)

'మహిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశంలోని ఇతర అనేక రాష్ట్రాలలో స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం మహిళా సాధికారత పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.


| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | | |
|---|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : | రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : | రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : | రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**

మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118

Web: www.apmas.org, E Mail: info@apmas.org


చేదును రుచి చూసిన తర్వాత తీపిని మరింత ఆనందిస్తాం; కష్టాలను అనుభవిస్తే కాని సుఖాల విలువ తెలియదు

# ఆశలను పెంచిన ఏపిమాస్ 20 ఏళ్ళ వేడుక !

– జె వి క్రిష్ణమూర్తి

అచ్చెరువు గొలిపే ప్రగతి గణాంకాలు, నిత్య ప్రవర్ధమానంగా కొనసాగే భాగస్వామ్య, దాతృత్వ సంస్థల, లబ్ధిదారుల ఆదరాభిమాన విశ్వాసాలు, సర్వత్రా పారదర్శక విధానాలు, కాలంతో పందెంవేసే వినూత్న ప్రక్రియలు, వ్యూహాత్మక కార్యక్రమాలు, ప్రస్ఫుటంగా గోచరించే విశిష్ట నాయకత్వ మార్గదర్శన రీతులు, అవకాశాలలోనే కాదు అడ్డంకులలో సైతం చెదరని అంకితభావంతో సాగించే కృషి ... యిన్ని సానుకూల పవనాలు తోడుగా 20 ఏళ్ళ మైలురాయికి చేరిన ఏపిమాస్, తన ద్విదశ వార్షికోత్సవాన్ని ఎంతో ఉత్తేజ, ఉద్వేగాలతోపాటు భవిష్యత్ సేవలపై మరింతగా ఆశలను, నమ్మకాన్ని పెంచే విధంగా ఉజ్వలంగా జరుపుకున్నది. కేవలం ఊకదంపుడు ఉపన్యాసాలు, గణాంకాల బేరీజులు, కొత్త లక్ష్యాల కఠోర నిర్దేశాలు కాకుండా 'ఈ ప్రస్థానం, ఈ ప్రగతి అందరి తోడ్పాటు ఫలితం, మన సేవలపై నమ్మకం నానాటికీ పెరుగుతున్నది, భవిష్యత్తు ఆశావహంగా వుంది, ఆ నమ్మకాన్ని నిలబెడదాం, ఆ ఆశలను నెరవేరుద్దాం... ఏపిమాస్ మనందరిదీ, దాని బాగోగులు మనందరివీ' అనే అభిప్రాయం ఈ 20 వ వార్షికోత్సవంలో పాల్గొన్న అందరిలో పాదుకునేలా ఆ వేడుక మనోజ్ఞంగా, ఆత్మీయంగా సాగింది.

ఎంతో స్ఫూర్తిదాయకమైన రీతిలో ఏడాది పొడవునా నిర్వహించిన వివిధ కార్యక్రమాల పతాకసన్నివేశమైన 20వ వార్షికోత్సవపు వేడుక ఏపిమాస్ పుట్టినరోజైన జులై ఒకటవ తేదీన హైదరాబాదులోని దాని ప్రధాన కార్యాలయంలో ప్రత్యక్ష, పరోక్ష వీక్షణ సాంకేతిక విన్యాసాలతో సరదాగా, అభినందన పూర్వకంగా, సందేశాత్మకంగా సాగింది.

**ఏపిమాస్ అంతటా వేడుకలు**

శ్రీమతి జె విజయలక్ష్మి, శ్రీ జి శ్రీనివాస్ ప్రార్థన, దేశభక్తి గీతాలాపనతో, అనంతరం జ్యోతి ప్రజ్వలనతో సంప్రదాయబద్ధంగా ఉదయం పదకొండు గంటల



ప్రాంతంలో మొదలైన ద్విదశ వార్షికోత్సవపు వేడుకలు ఆ తరువాత 'వెబినార్' వీక్షణ విన్యాసంతో వివిధ రాష్ట్రాలలో, వివిధ ప్రాంతాలలోని కార్యక్షేత్రాలలో పనిచేసే ఏపిమాస్ సిబ్బందినందరిని ఒకే వేదికమీదకు తీసుకువస్తూ ఎంతో ఉరవడిగా, ఉత్సాహంగా, ఉల్లాసంగా సాగాయి. ఇటు హైదరాబాదులోని ప్రధాన కార్యక్షేత్రంలో జ్యోతి ప్రజ్వలన, కేక్ కటింగ్ జరుగుతుండగానే , అదే సమయంలో మదనపల్లి, కర్నూలు, గుత్తి, కామారెడ్డి, పాట్నా (బీహార్) లలోని ఏపిమాస్ కార్యక్షేత్రాలలో అవే వేడుకలు జరుగుతున్న దృశ్యాలు సందడిచేశాయి.

**మహిళా సాధికారత ... డాక్టర్ ప్రయోగాలు**

కమిట్మెంట్స్ సేవా సంస్థకు చెందిన డాక్టర్ సిహెచ్





చంద్రశేఖర్ 'మహిళా సాధికారత' పత్రికలకు చెందిన విభిన్న ముఖపత్రాలతో ఒక పోస్టర్‌ను రూపొందించి, ఈ వార్షికోత్సవ సమావేశంలో ప్రదర్శించడం ఒక విశేషం. ఆయన 'మహిళా సాధికారత' వివిధ సంచికలలో వచ్చిన కొన్ని సంపాద కీయాలను, మంచిమాట, జీవనవేదం రచనలను, వ్యవసాయ, ఆరోగ్య తదితర కొన్ని వ్యాసాలను క్రోడీకరించి పుస్తకాలుగా రూపొందించి పాత అంశాలను పదుగురికి మరింత ఉ పయోగపడే రీతిలో విజ్ఞాన వ్యాప్తికి ఎలా దోహదం చేయవచ్చునో ప్రత్యక్షంగా చూపి అందరి అభినందనలను అందుకున్నారు.

ప్రతి కార్యక్షేత్రం నుంచి కొందరు సిబ్బంది ఏపిమాస్ 20 ఏళ్ళ ప్రస్థానంలో సాధించిన విజయాల గురించి, ఎత్తుపల్లాల గురించి తమ అనుభవాలను ఈ వెబినార్ వేదికలో పంచుకున్నారు. కొన్ని చోట్ల కొందరు ఆహ్వానిత అతిథులు ఈ వేడుకలో పాల్గొని ఏపిమాస్ కు అభినందనలు, ఆశీస్సులు అందించారు. ప్రధాన కార్యాలయ సిబ్బంది ఒక్కొక్కరు ఒక్క మాటలో ఏపిమాస్ గురించి తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు.

మధ్యలో శ్రీ జె వి క్రిష్ణమూర్తి ఏపిమాస్ ప్రత్యేకతల గురించి క్లుప్తంగా ప్రసంగించారు.



**పెరిగిన విశ్వసనీయత : సి ఎస్**

ఉదయంపూట కార్యక్రమాలకు ముగింపుగా సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి క్లుప్తంగా ప్రసంగిస్తూ ఏపిమాస్ ఆవిర్భావ సంఘటనలను, తనతోపాటు ఏపిమాస్ వ్యవస్థాపకులైన డాక్టర్ పి కోటయ్య, శ్రీ విజయ మహాజన్, శ్రీమతి నందితా రే, శ్రీ ఎన్ పి టకర్, శ్రీ కె రాజులను గుర్తుచేసుకున్నారు. కేవలం కార్యాలయం నాలుగు గోడలకు పరిమితం కావడం తనకు నచ్చదని, క్షేత్ర పర్యటనలు చేసి వాస్తవిక స్థితి గతులు తెలుసుకోవడాన్ని తాను యిష్టపడతానని అన్నారు. ఏపిమాస్‌తో కలసి పనిచేసే భాగస్వాములలో ఏపిమాస్ పట్ల ఎంతో నమ్మకం వుందని, ఎంచుకున్న మార్గంలో, చేపట్టిన కార్యక్రమం పట్ల అంకిత భావంతో పనిచేయడమే తప్ప స్వార్థానికో, స్వప్రయోజనాలకో ఏపిమాస్ పనిచేయదని వారందరూ గట్టిగా నమ్ముతుండడం తాను గమనించానని, యిది ఏపిమాస్ సాధించిన విశ్వసనీయత అని, ఏపిమాస్‌తో కలసి పనిచేయాలని అభిలషించే సంస్థల సంఖ్య నానాటికీ పెరుగుతున్నదని, ఈ రోజు కూడా ఐదు ఎం ఓ యు లు కుదుర్చుకుంటున్నామని చెప్పారు.

ప్రపంచాన్ని మార్చాలనుకోవడం కాదు, ముందుగా నీవు మారు; ఆ అవగాహనే వివేకం



**భాగస్వాములు, శ్రేయోభిలాషుల అభినందనలు**

భోజనానంతరం తిరిగి మధ్యాహ్నం మొదలైన సమావేశం పాలకవర్గం, భాగస్వాములు, శ్రేయోభిలాషుల స్పందనలను తెలుసుకోవడానికి ప్రాధాన్యం యిచ్చింది. ఏపిమాస్ పాలకవర్గ సభ్యురాలు శ్రీమతి మహాపర అలీ ఈ వేడుకలో ప్రత్యక్షంగా పాల్గొనగా, మిగతా వారు వెబినార్ ద్వారా పాల్గొన్నారు. ఛైర్మన్ శ్రీ కె మాధవరావు, నాబార్డ్ ఛైర్మన్ జి ఆర్ చింతల, శ్రీమతి నందితా రే, శ్రీ విజయ్ మహాజన్, శ్రీ ఎన్ వి రమణ, జి ఐ జడ్ కు చెందిన శ్రీ గెరిట్, శ్రీ జయేష్ రంజన్, శ్రీ వి ప్రవీణ్ రావు, డాక్టర్ కె సి గుమ్మగోల్, శ్రీ రామ్ కౌండిన్య, శ్రీమతి గిరిజా శ్రీనివాసన్, శ్రీ పాపారావు, శ్రీ మోహనయ్య, శ్రీ రఘు, శ్రీ జి వి ఎస్, శ్రీ పి సతీష్, ప్రొఫెసర్ సుధారాణి, శ్రీ ఎస్ ఎస్ భట్, శ్రీ నరసింహన్ శ్రీనివాసన్, బీహార్ నుంచి జీవిక సి ఇ ఓ, కెనడా నుంచి డేవిడ్ ఫ్లెచర్, శ్రీ అనుజ్ జైన్, జర్మనీ నుంచి కోర్బీనియన్ మార్జ్ ప్రభృతులు ఈ వెబినార్‌లో పాల్గొని ఏపిమాస్ 20 ఏళ్ళ ప్రస్థానాన్ని అభినందించి, భవిష్యత్తులో మరింత సుస్థిర ప్రగతితో, మరెందరికో సేవలందించాలని ఆశీర్వదించారు.

'మహిళా సాధికారత' విశిష్ట సంచికతో సహా 20 వ వార్షికోత్సవ సందర్భంగా ప్రచురించిన 20 ప్రచురణలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. కొత్తగా ఐదు సంస్థలతో భాగస్వామ్య ఒప్పందాలను కుదుర్చుకున్నారు.

రోజంతా సాగిన వార్షికోత్సవ వేడుకలు రాబోయే కాలంలో ఏపిమాస్ మరింత బలోపేతమై, మరిన్ని రంగాలలో మరింత విశిష్ట సేవలను అందిస్తుందనే నమ్మకాన్ని, ఆశాభావాన్ని కలిగిస్తూ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ మధుమూర్తి వందన సమర్పణతో ముగిశాయి. ■



## కర్నూలులో ఏపిమాస్ 20వ వార్షికోత్సవం

**– బండ్ల వెంకటేశ్వర్లు**

ఏపిమాస్ 20 వ వార్షికోత్సవ వేడుకలు హైదరాబాదులోని ప్రధాన కార్యాలయంతో పాటు క్షేత్రస్థాయి కార్యాలయం కర్నూలులో కూడా జరిగాయి. ముఖ్య అతిథిగా అపార్డ్ సి ఈ ఓ శ్రీ తిరుపతిరెడ్డి ఈ వేడుకలలో పాల్గొని, ఏపిమాస్ ఎన్నో విశిష్ట కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని, నాణ్యమైన శిక్షణలతో మానవ వనరులను అభివృద్ధి చేయడం, ప్రభుత్వ సంస్థలతో, వివిధ స్వచ్ఛంద సంస్థలతో కలసి పనిచేస్తూ, గ్రామీణ, పట్టణ సమాజాల్లోని నిరుపేదల జీవనాన్ని మెరుగుపరచడం కోసం సి ఈ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి నాయకత్వంలో ఏపీమాస్ అలుపెరగని కృషి చేసిందని, ఈ కృషి కొనసాగాలని అభినందనలు తెలియజేశారు. అతిథిగా పాల్గొన్న న్యాయవాది శ్రీ కె సి రాములు ఏపిమాస్ సమాజ అభివృద్ధి కృషిలో 20 వసంతాలు పూర్తి చేసిన సందర్భంగా శుభాభినందనలు తెలియజేశారు.

వీరితోపాటు సమున్నతి సంస్థ నుండి శ్రీ సందీప్, కోరమాండల్ సంస్థ నుండి శ్రీ మోహన్, ఏపీమాస్ కర్నూలు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రీ వెంకటేశ్వర్లు 20 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఏపిమాస్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ నల్లారెడ్డి రైతు సంస్థ గోనెగండ్ల నుండి బోర్డు డైరెక్టర్లు, ఏపీమాస్ వ్యాపార అభివృద్ధి అధికారి శ్రీ పవన్‌కుమార్, రైతు సంస్థల సి ఈ ఓ లు శ్రీ హరిబాబు, కుమారి సుప్రజ, శ్రీ సురేష్‌బాబు, కుమారి మనీషా, కుమారి హరిత, శ్రీ వెంకటేశ్వర్లు తదితరులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. ■

గెలుపు ఆనందాన్ని ఇస్తుందో లేదో కాని, మానసికానందం గెలుపు దారి చూపుతుంది

# పాత పత్రికలతో సరికొత్త వైజ్ఞానిక సందేశం !

**ఆ**రోజు 2021 జులై 1వ తేదీ ఉదయం 12 గంటల ప్రాంతం. అది హైదరాబాద్ మణికొండలోని ఏపిమాస్ ప్రధానకార్యాలయంలో సమావేశ మందిరం. సందర్భం ఏపిమాస్ 20 వ వార్షికోత్సవం. అక్కడ సమావేశమైన దాదాపు 20 మంది వార్షికోత్సవ సంరంభంలో నిమగ్నమై వున్నారు. ఇంతలో అక్కడి చాలామందికి పరిచయంలేని దాదాపు 70 ఏళ్ళ పొడవాటి వ్యక్తి చేతిలో రంగురంగుల అట్టపెట్టె, చుట్టచుట్టిన ఒక డ్రాయింగ్ షీటు వగైరా పట్టుకుని అక్కడికి వచ్చారు. ఆయనను చూడగానే 'రండి రండి డాక్టర్ గారూ' అంటూ సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి సాదరంగా ఆహ్వానించారు.




వీరు డాక్టర్ చంద్రశేఖర్ గారు. వృత్తి రీత్యా వైద్యులు. కమిట్‌మెంట్స్‌లో పనిచేస్తున్నారు. దివ్యాంగుల సేవకు అంకితమైన వ్యక్తి. వీరు మన మహిళా సాధికారత మ్యాగజైన్లతో ఏదో చేశారట. చూద్దాం' అంటూ సమావేశానికి పరిచయంచేశారు.

అప్పుడు డాక్టర్ చంద్రశేఖర్ చేతిలోని కాగితంచుట్ట విచ్చుకుంది. ఆట్టపెట్టె మూత తెరుచుకుంది. అందరూ ఆసక్తితో గమనిస్తుండగా డాక్టర్ చంద్రశేఖర్ ఒక ఇంద్రజాలికుడి మాదిరిగా ఆ పెట్టెలోనుంచి ఒక్కొక్కటే బయటపెట్టసాగారు. ఆ డ్రాయింగ్ షీట్ మహిళా సాధికారత పాత పత్రికల ముఖచిత్రాలతో రంగురంగులలో అర్థవంతంగా, ముచ్చటగా, ఆకర్షణీయంగా ముస్తాబై ఒక పోస్టర్ లాగా తయారైంది. ఆ అట్టపెట్టెలో నుంచి ఐదారు మహిళా సాధికారత పత్రికలను ఆయన బయటపెట్టారు. ఐతే, అవి సరికొత్తరూపు సంతరించుకున్న పాత పత్రికలు. వివిధ పత్రికలలోని



సంపాదకీయాలు, వ్యవసాయ, ఆరోగ్య, ఉపాధి కల్పన తదితర వ్యాసాలను, జీవనవేదం, మహనీయుల మహితోక్తులు మొదలైనవాటిని క్రోడీకరించి ఆయన వాటికి కొత్తరూపం యిచ్చారు. అబ్బురపరిచే రీతిలో ఆయన చేసిన ఆ రూపకల్పనలను చూసి అందరూ హర్షధ్వానాలతో ఆయనను అభినందించారు.

ఆయన వృత్తిరీత్యా ఎంతో బిజీగా వుండే వైద్యుడు. 2000 మందికి పైగా దివ్యాంగులకు అంగవైకల్యాన్ని సరిచేసే శస్త్రచికిత్సలు చేసిన, చేయించిన వ్యక్తి. వయసు పైబడినవాడు. ఐనా ఇంత శ్రమకోర్చి, సమయాన్ని వెచ్చించి ఈ రూపకల్పనలు చేయడానికి కారణం చుట్టుపక్కలవున్న సమాజాన్ని, రాబోయే తరాన్ని విజ్ఞానవంతులుగా, వివేకవంతులుగా, సంస్కారవంతులుగా చేయాలన్న తపన. అందుకోసం అందుబాటులోవున్న ప్రతి వనరును పరిపూర్ణంగా, పునర్వినియోగించుకోవాలన్న ఆరాటం. విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులు ఊరకే పొద్దుపుచ్చుతూ సోమరులుగా, అనవసరమైన గుంజాటనలతో గడిపేకంటే ఈ విధంగా పాత ప్రత్రికలలోని విశేషాంశాలను కత్తిరించి, ఒక పుస్తకంలో అతికించి విలువైన ఆ జ్ఞానసంపద వృధాపోకుండా ముందుతరాలకు అందించి తమ జీవితాలను సార్థకం చేసుకోవచ్చు కదా అని డాక్టర్ చంద్రశేఖర్ ప్రశ్నిస్తారు. ఈ పనికి యింటిలోని మనుమలను,



**(మిగతా 32 వ పేజీలో)**

# కరోనా బాధితులకు 'ఆజీవ' పౌష్టికాహారం !

– అనంత, భూమాత ఎఫ్ పి ఓ ల సిబ్బంది

**ఆ**జీవ ప్రాజెక్ట్ పరిధిలోని గ్రామాలలో కరోనా వ్యాధి సోకిన కుటుంబాలకు అనంత గ్రామీణ మహిళా ఎఫ్ పి ఓ, భూమాత ఎఫ్ పి ఓ చెరి ఆరు గ్రామాలలో పౌష్టికాహారం, చిరుధాన్యాలు, పండ్లు పంపిణీచేశాయి. కరోనా నిర్ధారణ అయిన వారిని పరామర్శించి, వారికి ధైర్యం చెప్పి, పాటించవలసిన జాగ్రత్తలను వివరించారు.






**అనంత ఎఫ్ పి ఓ చే 200 కిట్ల పంపిణీ**

అనంత గ్రామీణ మహిళా ఎఫ్ పి ఓ సభ్యులు ఏపిమాస్, ఏ ఇ ఐ ఎన్ సంస్థల తోడ్పాటుతో ఆజీవ ప్రాజెక్ట్ పరిధిలోని ఆరు గ్రామాలలో (కామారుపల్లి, కురుగుంట, చిన్నంపల్లి, కోడిమి, తాటిచర్ల, పూలకుంట) కోవిడ్ బాధితులకు నిత్యావసర సరుకులు, పండ్లతో కూడిన కిట్లను పంపిణీ చేశారు.

ఈ గ్రామాలలో ఆశ కార్యకర్తలు, ఎ ఎన్ ఎంలు, సర్పంచులు, సెక్రటరీ, గ్రామ వలంటీర్లు కలసి కోవిడ్ బాధితులకు అవగాహన కల్పిస్తూ గ్రామ స్థాయి ఐసోలేషన్ సెంటర్‌లు ప్రారంబించి, కోవిడ్ వ్యాధి సోకి ఇంట్లో ఉండటానికి సదుపాయంలేని వారు గ్రామ ఐసోలేషన్ సెంటర్‌లో ఉండవచ్చు అని అవగాహన కల్పిస్తూ, వారు పౌష్టికాహారం తీసుకోవలసిన అవసరాన్ని వివరించారు. వారి ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

కామారుపల్లి గ్రామంలో 26 కిట్లు, కురుగుంటలో 83 కిట్లు, చిన్నంపల్లిలో 24 కిట్లు, కోడిమి గ్రామంలో 43 కిట్లు, తాటిచెర్లలో 10 కిట్లు, పూలకుంటలో 14 కిట్లను అందజేశారు. పోషకాహార కిట్లలో అండుకొర్రలు, సామలు, ఆరికలు, రాగులు మొదలైన చిరుధాన్యాలు 500 గ్రాముల వంతున, చిరుధాన్యాల కిచిడి 500 గ్రాములతో పాటు, మామిడిపండ్లు, బత్తాయి పండ్లు, అనాస పండ్లతో కూడిన (కిలో గ్రాము వంతున ఏవైనా రెండు రకాల పండ్లు) పండ్ల కిట్లను కూడా పంపిణీ చేశారు. చిరుధాన్యాల కిట్ ఒక్కొక్క దాని విలువ 350 రూపాయలు, పండ్ల కిట్ విలువ 70 రూపాయలు. మొత్తం 200 కిట్లను పంపిణీ చేశారు.

**'భూమాత'చే చిరుధాన్యాల తినుబండారాలు**

భూమాత ఎఫ్ పి ఓ పరిధి లోని 6 గ్రామాలలో ఆజీవ ప్రాజెక్ట్‌లో భాగంగా ఎఫ్ పి ఓ బోర్డు సభ్యుల ఆధ్వర్యంలో కరోనా బాధిత కుటుంబాలకు చిరుధాన్యాలతో చేసిన తినుబండారాలను (కొర్ర చక్కిలాలు, కొర్ర నిప్పట్లు, సజ్జ నిప్పట్లు, రాగి బూంది, కొర్ర బూంది, జొన్న కారాలు, జొన్న చేగోడీలు) పంపిణీ చేశారు. అజీవ ప్రాజెక్ట్, భూమాత ఎఫ్.పి.ఓ ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు, ఏ.ఎఫ్. ఎకాలజీ సెంటర్ మండల సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు ఈ పంపిణీలో పాల్గొన్నారు.

**1. రావులచెరువు :** రావులచెరువు గ్రామంలో చిరు ధాన్యాలతో చేసిన పౌష్టికాహర తినుబండారాల కిట్లను 52 మంది



సభ్యులకు వారి యిళ్ళ వద్దకు వెళ్ళి, వారి ఆరోగ్య విషయాలను అడిగి, వారికి మనోధైర్యం చెప్పి పంపిణీ చేయడం జరిగింది. అలాగే కోవిడ్ పాజిటివ్ వచ్చిన వారికి ఏ.యన్.యం. ఆశా వర్కర్స్‌తో సలహాలు సూచనలు యిప్పించారు.

**2. ధర్మపురి :** ధర్మపురి గ్రామంలో కోవిడ్ పాజిటివ్ కేసులు 54 వున్నాయి. కోవిడ్ పాజిటివ్ వచ్చిన వారి యిళ్ళ వద్దకు భూమాత యఫ్.పి.ఓ సభ్యుల ఆధ్వర్యంలో వెళ్ళి, వారి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకొని, ధైర్యం చెప్పి, సలహాలు సూచనలు యిచ్చారు.



**3. యన్.ఆర్.కె. కొట్టాల :** ఈ గ్రామంలో 4 కేసులు వున్నాయి. వీరికి చిరుధాన్యాల పౌష్టికాహార తినుబండారుల కిట్లను పంపిణీ చేయడం జరిగింది.

**4. సి. బత్తలపల్లి :** ఈ గ్రామంలో 32 మందికి ఏ.ఎఫ్. ఎకాలజీ సిబ్బంది, కార్యకర్తలు పౌష్టికాహార తినుబండారుల కిట్లను అందజేశారు.

**5. పోతులనాగేపల్లి :** ఈ గ్రామంలో కోవిడ్ పాజిటివ్ కేసులు 35 వున్నాయి. వీరికి ఏ.ఎఫ్. ఎకాలజీ సిబ్బంది చిరుధాన్యాల పౌష్టికాహార తినుబండారుల కిట్లను అందజేశారు.

**6. తుంపర్తి :** తుంపర్తి గ్రామంలో కోవిడ్ బారినపడ్డవారు 31 మంది వున్నారు. వీరికి పౌష్టికాహార కిట్లను పంపిణీ చేయడం జరిగింది.

**ప్రజల స్పందన**

"కోవిడ్ కారణంగా గ్రామాలలో చాలా మంది అనారోగ్యంతో బాధపడుతున్నారు. భూమాత ఎఫ్ పి ఓ, అజీవ ప్రాజెక్ట్ వారు కోవిడ్ పాజిటివ్ వచ్చిన వారికి పౌష్టికాహారం అందించడం చాలా సంతోషకరమైన విషయం. కోవిడ్ సోకిన వారితో మాట్లడటం, వారికి ధైర్యం కలిగించడం మెచ్చుకోవలసిన విషయం. మా ఆరోగ్యాలపట్ల ఇంత శ్రద్ధ చూపిన అజీవ ప్రాజెక్ట్, భూమాత యఫ్.పి.ఓ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నాము" అని గ్రామాలలోని ప్రజలు చెప్పారు. ■

విభిన్న ఫలితాలు వస్తాయనే ఆశతో ఒకే పనిని ఒకే రకంగా పదే పదే చేయడాన్ని మించిన అవివేకం ఏముంటుంది?

# ఏపిమాస్ కార్యక్రమాల కూడలిగా చిత్తూరు జిల్లా !

– ఎస్. ప్రహల్లాద, డి.జగన్‌మోహన్‌రెడ్డి

ఒక చెట్టు తాను పెరుగుతూ పదిమందికి నీడ యివ్వడం చూస్తున్నాం. అదేవిధంగా ఏపిమాస్ విషయంలో కూడా అది యదార్థమని ఎప్పటికప్పుడు నిరూపితమవుతూనే వున్నది. 2001 సంవత్సరంలో ఏర్పడి అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లోని మూడు జిల్లాలలో తమ కార్యక్రమాలను ప్రారంభించిన ఏపిమాస్ 2021 నాటిని భారతదేశంలోని తెలుగు రాష్ట్రాలతో పాటు బీహార్ రాష్ట్రంలో ప్రత్యక్షంగాను, ఒడిశా, ఉత్తరప్రదేశ్ మొదలగు రాష్ట్రాలలో ఇతర స్థానిక సంస్థలతో కలసి వివిధరకాల కార్యక్రమాలతో ప్రతి సంవత్సరం వేలాది మంది కొత్త లబ్ధిదారులకు చేరువవుతూ పేద మహిళల, రైతుల




పక్షపాతిగా పేరు పొందుతూ శ్రీ సిఎస్ రెడ్డి గారి సమర్థ నాయకత్వంలో ముందడుగులు వేస్తున్నది. ఇప్పటివరకు రెండు లక్షల యాభై వేల మందికి చేరువ అయిన ఏపిమాస్ కార్యక్రమాలు 2030 నాటికి దేశంలోని వివిధ రాష్ట్రాలలోని పది లక్షల మందికి చేరువ కావాలని పునరంకితమైంది.

2021 జూలై 1వ తేదీనాటికి రెండు దశాబ్దాలు విజయవంతంగా పూర్తి చేసుకొని 20 వసంతాల వేడుకలను దేశ విదేశీ ప్రముఖుల అభినందనలతో కన్నుల పండువుగా జరుపుకున్నది. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లాలో ఏపిమాస్ చేపట్టిన కార్యక్రమాలను ఒకసారి సమీక్షిద్దాం.

**చిత్తూరు జిల్లాలో ఏపిమాస్ ప్రస్థానం**

ఏపిమాస్ సంస్థ ప్రారంభించిన 2001వ సంవత్సరం నుండి చిత్తూరు జిల్లాలో సాంకేతిక వనరుల సంస్థగా కార్యక్రమాలను ప్రారంభించి, అంచెలంచెలుగా వివిధ కార్యక్రమాలను అమలు చేసే సంస్థగా ఎదిగి జిల్లాలోని పట్టణ, గ్రామీణ మహిళల, రైతుల గుండెలలో సుస్థిర స్థానం సంపాదించుకున్నదని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

**సామర్థ్యం పెంపుదల, సాంకేతిక సలహా సంస్థ**

నాటి ప్రతిష్ఠాత్మక "వెలుగు" ప్రాజెక్టులో భాగంగా గ్రామ స్థాయిలో స్వయం సహాయ సంఘాలను, గ్రామ సంఘాలను, మండల స్థాయిలో మండల మహిళా సమాఖ్యలను, జిల్లా స్థాయిలో జిల్లా సమాఖ్యను ఏర్పరచి వాటిని బలోపేతం చేయడంకోసం వివిధ స్థాయిలలో సిబ్బందిని నియమించి, ఆ స్వయంసహాయ సంస్థల సిబ్బందికి వివిధ దశలలో నిరంతరం సామర్థ్య పెంపుదల కార్యక్రమాలను చేపట్టి, ప్రజా సంస్థలు స్వయంశక్తితో, స్వయంసమృద్ధంగా ఎదగడానికి ఏపీమాస్ తన వంతు తోడ్పాటు అందించింది.

**మూడు ఆదర్శ క్లస్టర్ల అభివృద్ధి**

ఇతర క్లస్టర్లకు ఆదర్శంగా స్వయంసహాయ సంస్థలను బలోపేతం చేయాలన్న సంకల్పంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తోడ్పాటుతో జిల్లాలోని పలమనేరు, పీలేరు, చిత్తూరు క్లస్టర్లలో, 18 మండలాలలో ప్రత్యేక సిబ్బంది ద్వారా నిరంతర కార్యక్రమాలను నిర్వహించింది.

ప్రజా సంస్థలలోని చురుకైన మహిళలను ఎంపిక చేసి వారిని రిసోర్స్ పర్సన్స్‌గా అభివృద్ధి చేయాలన్న వెలుగు ప్రాజెక్ట్ లక్ష్యంలో భాగంగా ఏపిమాస్ సిబ్బంది జిల్లా స్థాయిలో

గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజా సంస్థలలోని వందలాది మంది కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లకు వివిధ దశలలో శిక్షణలు, క్షేత్ర సందర్శనలు నిర్వహించింది.

**శిక్షణ కరదీపికలు**

జిల్లాలోని స్వయంసహాయ సంస్థలు స్వయంశిక్షణతో తమంత తాముగా అభివృద్ధి చెందడంకోసం ప్రాజెక్టు తరపున వివిధ రకాల శిక్షణ కరదీపికలను రూపొందించింది. ముఖ్యంగా మండల సమాఖ్య ఉప కమిటీల బలోపేతం కోసం రూపొందించిన కరదీపికను మండల సమాఖ్యలు ఎంతగానో ఉపయోగించుకున్నాయి.



**రిసోర్స్ బుక్‌కీపర్ల వ్యవస్థ**

వివిధ స్థాయిలలోని స్వయం సహాయ సంస్థలు తమ కార్యక్రమాలను ముఖ్యంగా ఆర్థిక కార్యక్రమాలను తామే స్వయంగా మదింపు చేసుకొని, అవసరాన్ని బట్టి తప్పొప్పులను సరిదిద్దుకొని ఇతరులపై ఆధారపడకుండా స్వావలంబనతో ముందుకు సాగాలన్న లక్ష్యంతో స్వయం నియంత్రణ ఉద్యమం పేరుతో రిసోర్స్ బుక్‌కీపర్ల వ్యవస్థకు రూపకల్పన చేసి జిల్లాలోని వందలాది మంది రిసోర్స్ బుక్‌కీపర్లకు శిక్షణలు యిచ్చింది.

2001 నుండి 2009 వరకు వెలుగు ప్రాజెక్టుకు సామర్థ్య పెంపుదల సంస్థగా సాంకేతిక తోడ్పాటు అందించిన ఏపిమాస్ 2009 సంవత్సరం నుండి వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాలను తానే స్వయంగా అమలు చేయడం ప్రారంభించింది.

**సమీకృత నీటి యాజమాన్య పథకం (వాటర్‌షెడ్)**

ఏపిమాస్ చేపట్టిన కార్యక్రమాలకు సంతృప్తి చెందిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జిల్లాలోని వెంకటగిరి కోట మండలం లోని ముదరందొడ్డి, రామసముద్రం మండలం లోని చొక్కాండ్లపల్లిలలో రెండు మెగా వాటర్‌షెడ్‌లను ఏపిమాస్ నిర్వహణకు కేటాయించింది.

ఈ పథకాన్ని విజయవంతంగా అమలుచేసి, 2019 సంవత్సరంలో పూర్తి చేయడం జరిగింది. ఏపిమాస్ చేపట్టిన వివిధరకాల కార్యక్రమాల నాణ్యత బాగా వుందని జిల్లా అధికారులతో పాటు సామాజిక తనిఖీ బృందం వారు ప్రశంసించారు. రెండు మండలాలలో దాదాపు 7300 హెక్టార్ల భూములలో 782 లక్షల రూపాయలతో వివిధ రకాల నీటి సంరక్షణ, తేమ సంరక్షణ, భూమి అభివృద్ధి కార్యక్రమాలను ఏపిమాస్ ఫలప్రదంగా అమలు జరిపింది.

**పచ్చదనాన్ని పెంచుదాం పచ్చగా వుందాం (జి4)**

భూమిపై రాను రాను తగ్గుతున్న పచ్చదనం వల్ల వాతావరణ కాలుష్యం ఏర్పడి, ప్రజలు వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. అందువలన పర్యావరణాన్ని పరిరక్షించి, గ్రామాలకు పూర్వ వైభవాన్ని తీసుకురావడంకోసం రామసముద్రం, వెంకటగిరికోట మండలాలలో ఎంపిక చేసిన గ్రామాలలో జర్మనీకి చెందిన బిఎఫ్‌టిడబ్ల్యూ వారి సహాయంతో 'పచ్చదనాన్ని పెంచుదాం పచ్చగా వుందాం' అనే నినాదంతో వినూత్న కార్యక్రమాలను ఏపిమాస్ చేపట్టింది.

**హరిత వినుత కేంద్ర పథకము (జిఐసి):**

పంట ఖర్చులు అధికమై, తక్కువ దిగుబడులతో, సరియైన ధరలు అందక తీవ్ర నిరాశకు గురియై వ్యవసాయాన్ని మాని ఇతర జీవనోపాధులకు మరలుచున్న రైతన్నలకు చేదోడు వాదోడుగా వుండి వ్యవసాయములో ఖర్చులను తగ్గించి, ఉత్పత్తులను మరియు ఆదాయాలను పెంపొందించుటయే లక్ష్యంగా జిఐజెడ్ జెర్మనీ వారి సహాయముతో 2016 నుండి హరిత వినుత కేంద్ర పథకమును (జిఐసి) జిల్లాలో అమలు చేయడం మొదలు

పెట్టడం జరిగింది. మొదటగా రామసముద్రం మండలంలో ప్రయోగాత్మకంగా ప్రారంభమన జిఐసి కార్యక్రమాలు ప్రస్తుతం రామసముద్రంతో పాటు వి.కోట, పలమనేరు, మదనపల్లి, నిమ్మనపలి, కలికిరి, వాల్మీకిపురం, కురబలకోట మొదలగు 8 మండలాలకు విస్తరించడం జరిగింది.

**పశువుల సంక్షేమానికి పాడి పంటలు కార్యక్రమం**

చిత్తూరు జిల్లాలో వ్యవసాయం తరువాత గ్రామీణ ప్రజలు ఎక్కువగా పాడి పరిశ్రమపై ఆధారపడి తమ జీవనాన్ని సాగిస్తుంటారు. రానురాను వ్యవసాయం తగ్గుముఖం పట్టడంతో పశుగ్రాసం కొరత వలన రైతులు 'పశు దాణా' పై ఆధారపడుతున్నారు. పశుదాణాలో వివిధ రకాల రసాయనాలు వాడడం వల్ల ఆ దాణా తిన్న ఆవుల పాలు తాగే ప్రజలు ముఖ్యంగా పిల్లలు వివిధ రకాల అనారోగ్యాలకు గురవుతున్నారు.

అందువలన గ్రామీణ ప్రజలకు పశుగ్రాస ప్రాముఖ్యతను తెలియచేసి పశుగ్రాస భద్రతే పరమావధిగా ఏఈఐఎస్ లగ్జంబర్గ్ వారి సహాయంతో జిల్లాలోని కురబలకోట, వాల్మీకిపురం మండలాలలో "పాడి పంటలు" పేరుతో వివిధ రకాల పశుగ్రాస భద్రతా కార్య క్రమాలను చేపట్టడం జరిగింది. ఇంతేకాక రాను రాను అంతరించిపోతున్న వివిధ రకాల చిరుధాన్యాలను ప్రోత్స హించడం కూడా ఈ పాడి పంటలు కార్యక్రమాలలో మరో ముఖ్యమైన అంశం.

**రైతు సంస్థలకు ప్రోత్సాహం**

జిల్లాలోని సన్న, చిన్నకారు రైతులతో 'రైతు ఉత్పత్తి దారుల సంస్థలను' (ఎఫ్ పి ఓ లను) ఏర్పాటుచేసి వారిలో సంఘటిత భావనను ప్రేరేపించి, వారు కలసికట్టుగా మరిన్ని ప్రయోజనాలను పొందడానికి వివిధ రకాల వినూత్న కార్యక్రమాలను రూపకల్పన చేసింది, చేస్తున్నది.

ప్రతి మండలంలో రైతు సేవా కేంద్రాల ఏర్పాటును ప్రోత్సహిస్తూ, రైతులకు కావలసిన వివిధ రకాల ఉత్పాదక, మార్కెటింగ్ సేవలను తమంత తాముగా పొందే విధంగా వారికి తోడ్పాటు అందిస్తున్నది. వివిధ రకాల కంపెనీల నుండి లైసెన్స్‌లను పొంది, పెద్ద తరహాలో వినూత్న కార్యక్రమాలను అమలు చేయుటకు జిల్లా స్థాయిలో మదనపల్లి కేంద్రంగా ఇప్పటివరకు ఏర్పడిన మండల స్థాయి రైతు ఉత్పత్తిదారుల సంస్థలతో 'ఎం.టమాట రైతు ఉత్పత్తి దారుల కంపెనీ' పేరుతో ఒక సమాఖ్యను ఏర్పాటు చేసి సభ్య సంస్థలకు వివిధరకాల ఉత్పాదక, మార్కెటింగ్ సేవలను అందిస్తున్నది.

**ఉద్యానశాఖ తోడ్పాటుతో ఎఫ్ పి ఓ ల నిర్వహణ**

గ్రామీణ ప్రాంతాలలోని రైతులతో రైతు ఉత్పత్తిదారుల సంస్థలను ఏర్పాటు చేసి, వాటిని వ్యాపార సంస్థలుగా అభివృద్ధి పరచి, సభ్య రైతులకు కావలసిన ఉత్పాదక, మార్కెటింగ్ సేవలను వారే స్వయంగా చేపట్టేవిధంగా వారిని చైతన్య వంతులను చేయుడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యానశాఖ 9 మండలాలను ఏపిమాస్ సంస్థకు కేటాయించింది. ఆ మండలాలలో ఇప్పటికే రైతు ఉత్పత్తిదారుల సంస్థలను ఏర్పరచి వివిధ రకాల కార్యక్రమాలను ఏపిమాస్ నిర్వహిస్తున్నది.

**పాఠశాలల అభివృద్ధి**

పీలేరు ప్రాంతంలో మౌలిక సదుపాయాలు తగినంతగా లేని ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక సదుపాయాలు కల్పించి పేద కుటుంబాల పిల్లలు సౌకర్యవంతంగా చదువుకోవడానికి మరుగుదొడ్లు, మంచినీటి వసతి, కుర్చీలు, బల్లలు మొదలగు వివిధ రకాల మౌలిక సదుపాయాలను సమకూర్చడం జరిగింది. ప్రముఖ ఫార్మా కంపెనీ 'అరబిందో ఫార్మా' వారు ఈ కార్యక్రమానికి నిధులను సమకూరుస్తున్నారు.

**సంపూర్ణ :** పీలేరు ప్రాంత రైతులకు వివిధ రకాల సేవలను అందించడానికి అరబిందో ఫార్మా సహాయంతో "సంపూర్ణ" పేరుతో మరో రైతు సమగ్ర పథకాన్ని అమలు చేయడం జరుగుచున్నది.

**ఆపరేషన్ గ్రీన్స్:** మనదేశంలో నెక్కువగా వినియోగించే కూరగాయలైన టమాట, ఉర్ల గడ్డలు (ఆలుగడ్డలు), ఎర్రగడ్డలను (ఉల్లిపాయలు) పండించే రైతుల శ్రేయస్సు కొరకు భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు జరుపుతున్న 'ఆపరేషన్ గ్రీన్స్' కార్యక్రమాన్ని అమలు చేయడంకోసం

**మూర్ఖుడు తాను చాలా తెలివిగలవాణ్ణని అనుకుంటాడు, కాని వివేకి తాను మూర్ఖుణ్ణనే అనుకుంటాడు**

జిల్లాలోని 8 మండలాలను ఏపిమాస్‌కు కేటాయించడం జరిగింది. ఇందులో భాగంగా టమాట పండించే రైతులకు మౌలిక సేవలను, విలువ ఆధారిత సేవలను అందిస్తారు.

**రైతు కోసం ఏపిమాస్ :**

రైతులకు వివిధ రకాల నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలన్న ఆశయంతో "రైతుకోసం ఏపిమాస్" పేరుతో ఒక "యూట్యూబ్" ఛానల్‌ను ప్రారంభించి, ఆ ఛానల్ ద్వారా రైతులకు ఉపయోగపడే వివిధ రకాల సమాచారాన్ని అందిస్తున్నారు. పైన పేర్కొన్న పంటలకు సంబంధించిన



వివిధ అంశాలపై 10 విడియోలను రూపొందించి ఈ వెబ్‌సైట్‌లో వుంచారు. వేలాదిమంది రైతులు ఈ ఛానల్‌ను చూసి తమ వ్యవసాయ సమస్యలకు పరిష్కారాలను తెలుసుకుంటున్నారు.

**భవిష్యత్ విస్తరణ కార్యక్రమాలు :**

ప్రస్తుతం చిత్తూరు జిల్లాలోని 14 మండలాలలో ఏపిమాస్ తన కార్యక్రమాలను అమలు చేస్తున్నది. ఈ ఏడాది చివరి నాటికి జిల్లాలోని 30 మండలాలకు కార్యక్రమాలను విస్తరించడానికి ఏపిమాస్ ప్రణాళికలను సిద్ధం చేసింది. ఏపిమాస్ ద్వారా ఏర్పాటు చేయబడిన రైతు ఉత్పత్తిదారుల సంస్థలలో ఇప్పటివరకు దాదాపు పదివేల మంది రైతులు సభ్యులుగా చేరారు. ఈ సంఖ్యను రెండింతలు చేయుటకు వివిధ కార్యక్రమాలను ఏపిమాస్ చేపడుతున్నది.

**కరోనా కల్లోలంలో రైతులకు తోడ్పాటు**

కరోనా కష్టకాలంలో లాక్‌డౌన్ వలన కొనేవారులేక పంటల ధరలు పడిపోయినపుడు, ముఖ్యంగా టమాటలకు ధరలు పడిపోయినపుడు ఏపిమాస్ సిఈఓ శ్రీ సిఎస్ రెడ్డి గారి చొరవతో 2020, 2021 సంవత్సరాలలో వివిధ రకాల రైతు తోడ్పాటు కార్యక్రమాలను చేపట్టడం జరిగింది.

2020 సంవత్సరంలో ఈ కార్యక్రమాలలో భాగంగా, ప్రజలకు పుష్కలంగా పోషక విలువలు కలిగిన వివిధ రకాల పండ్లను తక్కువ ధరలకు అందించడం, 4500 మాస్క్‌లను ఉచితముగా అందించడం జరిగింది.

సభ్య రైతులు పండించిన 2000 టన్నుల టమాటలను తోటల వద్దే కొనుగోలుచేసి రవాణా ఖర్చులను పూర్తిగా భరించి 500 కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం జరిగింది

**2021 సంవత్సరంలో చేపట్టిన కార్యక్రమాలు**

- సభ్య రైతులు పండించిన 2110 టన్నుల టమాటలను వాటి తోటల వద్దే కొనుగోలు చేసి రవాణా వ్యయాలను పూర్తిగా భరించి 750 కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం జరిగింది.
- కురబలకోట, వాల్మీకిపురం మండలాలలో కోవిడ్ వలన ఇబ్బంది పడుతున్న పేదలకు ఆరోగ్య సంరక్షణ కిట్‌లను ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది.
- మామిడి, కరబూజ మొదలైన పండ్లను, క్యాబేజీ మొదలైన కూరగాయలను తోటల వద్దనే కొనుగోలు చేసి రైతులకు మంచి ధరలను అందించడం జరిగింది.

ఇంతేగాక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున చిత్తూరు జిల్లాలో ఇతర స్వచ్ఛంద సంస్థలతో కలసి సమిష్టిగా కోవిడ్ నిర్మూలన కార్యక్రమాలను ఏపిమాస్ చేపట్టింది.

శ్రీ సిఎస్ రెడ్డి నాయకత్వంలో ఇన్ని వినూత్న, ఫలప్రద కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్న ఏపిమాస్ పేదల, మహిళల, రైతుల గుండెలలో చిరస్థాయిగా నిలిచి పోతుందనడంలో సందేహం లేదు.

■

చదవని అక్షరాస్యుడు నిరక్షరాస్యుని కంటె ఏం మెరుగు ?

# సూళ్ళూరుపేటలో క్లాప్ శిక్షణ కార్యక్రమం

– ఆర్‌వైవిఎస్‌వి భాస్కరరావు

**ఆం**ధ్రప్రదేశ్ ప్రభుత్వం నగరాలలో పరిశుభ్రతను, పారిశుధ్యాన్ని పాటించటం ప్రధాన అంశంగా గుర్తించి ఆ దిశగా నగరాలను సుందరంగా తీర్చిద్దిద్దుటకు ఉద్యమ రూపంలో 'క్లీన్ ఆంధ్రప్రదేశ్' కార్యక్రమాన్ని చేపట్టింది. దీనిలో భాగంగా సూళ్ళూరుపేట మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుటకు మెప్మా రిసోర్స్ పర్సన్లకు 'క్లాప్' శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. సూళ్లూరుపేట



మునిసిపల్ ఛైర్మన్ శ్రీ దబ్బల శ్రీమంత్‌రెడ్డి క్లీన్ ఆంధ్రప్రదేశ్ ముఖ్య ఉద్దేశాలను, కమిషనర్ శ్రీ నాగిశెట్టి నరేంద్రకుమార్ క్లాప్ విధానాన్ని గురించి వివరించారు. తడి చెత్త, పొడిచెత్తనే కాకుండా హానికర వ్యర్థాన్ని కూడా వేరుచేసి ఇంటినుండి 100% చెత్త సేకరణ జరిగేటట్లు సూళ్లూరుపేట మున్సిపాలిటీని సుందరంగా తీర్చిద్దిద్దుటకు అందరూ సహకరించాలని వారు కోరారు.

**క్లీన్ ఆంధ్రప్రదేశ్ ముఖ్య ఆశయాలు**

- బిన్ ఫ్రీ, లిట్టర్ ఫ్రీ, గార్బేజ్ ఫ్రీ
- నగరాలను పరిశుభ్రంగా మార్చుట
- నూటికి నూరు శాతం ఇళ్ళ నుండి చెత్త సేకరణ
- ఇంటి వద్దే కంపోస్టింగ్‌ను ప్రోత్సహించుట
- తడిచెత్త, పొడిచెత్త, ప్రమాదకరమైన నూటికి నూరు శాతం వ్యర్థాలను వేరు చేయుట
- వేరు చేసిన వ్యర్థాలను నూటికి నూరు శాతం తడి, పొడిచెత్త నిర్వహణ ప్రాజెక్ట్‌ల ద్వారా నిర్వహించడం

**క్లాప్ విధానంలోని ముఖ్యాంశాలు**

- ఇంటింటి నుండి తడి, పొడి మరియు ప్రమాదకరమైన వ్యర్థాలను గార్బేజ్ టిప్పర్ ద్వారా సేకరించుట.
- ప్రతి ఇంటి నుండి హోమ్ కంపోస్ట్‌ని ప్రోత్సహించుట.
- ప్రతి 8 నుంచి 10 వార్డులకు ఒక గార్బేజ్ ట్రాన్స్ ఫర్ స్టేషన్ నిర్మించుట.
- ఘన వ్యర్ధ నిర్వహణ వాహనాలను సమర్ధవంతంగా ఉపయోగించుట.
- వేరు చేసిన ఘన వ్యర్థాలను నూటికి నూరు శాతం ప్రాజెక్ట్‌ల ద్వారా ప్రోసెస్ చేయుట.

ఈ విధానాలను మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు, సిబ్బంది అందరూ భాగస్వాములై విజయవంతంగా పనిచేసి సూళ్లూరుపేటను అగ్రస్థానంలో నిలబెట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఓ శ్రీ పోతురాజు, మెప్మా సిటీ మిషన్



మేనేజర్ శ్రీ పెంచలయ్య, సి.ఓ.లు శ్రీమతి నారాయణమ్మ, శ్రీమతి హనుమాయి, శ్రీ ఆర్. భాస్కర్‌రావు (ఏపిమాస్ – యునిసెఫ్), ఆర్‌పి అరుణ, టిఎల్‌ఎఫ్ అధ్యక్షులు శ్రీమతి స్వప్న, టిఎల్‌ఎఫ్ కార్యదర్శి శ్రీమతి వెంకట రవణమ్మ, ఆర్‌పిలు పాల్గొన్నారు. ■

# సర్పంచ్ పదవికి ఉపకరిస్తున్న ఎఫ్ పి సి శిక్షణ

– వాసుదేవరెడ్డి

*వ్యవసాయ ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం (ఎఫ్ పి ఓ) సభ్యురాలిగా చేరి, గ్రీన్ ఇన్నోవేషన్ సెంటర్ (జిఐసి) ప్రాజెక్ట్ ద్వారా ఏపిమాస్ ఆధ్వర్యంలో శిక్షణలు పొంది నిమ్మనపల్లి వ్యవసాయ ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్‌కి డైరెక్టరుగా అనుభవం గడించి, గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికై శ్రీమతి ఉషారాణి అనతికాలంలోనే ఇటు ప్రజల, అటు అధికారుల మన్ననలు అందుకొంటున్నారు. సర్పంచ్‌గా తన పదవీ బాధ్యతల నిర్వహణలో తాను ఎఫ్ పి ఓ సభ్యురాలిగా పొందిన శిక్షణలు ఎంతగానో ఉపకరిస్తున్నాయని ఆమె అన్నారు.*

---

చిత్తూరు జిల్లా, నిమ్మనపల్లి మండలం, అగ్రహారం గ్రామ పంచాయతి, అగ్రహారం గ్రామానికి చెందిన 41 సంవత్సరాల వడ్లమూడి ఉషారాణిది సాధారణ వ్యవసాయ కుటుంబం. వెనుకబడిన తరగతులకు చెందిన ఆమె 10వ తరగతి వరకు చదువుకొన్నది. ఆమె భర్త వడ్లమూడి కైలాసపతి గారు ఆదర్శ రైతుగా, ఎఫ్‌పిసి లో రైతుమిత్రగా, మంచి వ్యక్తిగా అందరికి సుపరిచితుడు. వారికి ఇద్దరు ఆడపిల్లలు.



శ్రీమతి ఉషారాణి 2017 సంవత్సరంలో అగ్రహారం, సామకోటవారిపల్లి పంచాయతీలలోని రైతులతో ఏర్పాటు చేసిన అన్నదాత వ్యవసాయ ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘంలో సభ్యురాలిగా చేరి, అధ్యక్షురాలిగా ఎన్నికై బాధ్యతలు నిర్వర్తించారు. తదనంతరం, 2018వ సంవత్సరంలో మండలస్థాయిలో ఏర్పాటు చేసిన నిమ్మనపల్లి వ్యవసాయ ఉత్పత్తిదారుల కంపెనికి డైరెక్టరుగా ఎంపికై; 2021వ సంవత్సరంలో సర్పంచిగా ఎన్నికై, నిమ్మనపల్లి ఎఫ్‌పిసి నియమావళి ప్రకారం డైరెక్టరు స్థానానికి రాజీనామా చేసేంతవరకు, 3 సంవత్సరాలపాటు నిర్విరామంగా విధులు నిర్వర్తించారు. అదేవిధంగా, 2019లో 8 మండలస్థాయి వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థలతో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఎం–టమాట వ్యవసాయ ఉత్పత్తిదారుల కంపెనీకి డైరెక్టరుగా ఎంపికై ఒక సంవత్సర కాలంపాటు సేవలు అందించడం జరిగింది. ఈసందర్భంగా తన విధి నిర్వహణ లో భాగంగా, ఎన్నో శిక్షణలు పొందడం, క్షేత్ర సందర్శనలకు వెళ్ళడం, విధుల నిర్వహణలో తోటి డైరెక్టర్లు, ఎఫ్‌పిసి, ఏపిమాస్ సిబ్బంది నుండి మెళకువలు నేర్చుకున్నారు.


అగ్రహారం గ్రామ పంచాయతీకి 13.03.2021 తేదీన జరిగిన ఎన్నికలలో గ్రామ సర్పంచిగా ఎన్నిక కాబడిన తను, ఏప్రిల్ 3వ తేదీన ప్రమాణ స్వీకారం చేసి, ఏప్రిల్ 5వ తేదీన గ్రామ సభను ప్రజలు, వార్డు మెంబర్లు, అధికారుల సమక్షంలో ఎలాంటి జంకు–గొంకు లేకుండా నిర్వహించడం, నిస్సందేహంగా తను ఎఫ్‌పిసి డైరెక్టరుగా పొందిన శిక్షణలు, అనుభవం వలననే అని, ప్రత్యేకించి సమావేశాల నిర్వహణ శిక్షణ ప్రభావం ఎంతో వున్నదని శ్రీమతి ఉషారాణి తెలిపారు.

గ్రామసభలో ప్రజల భాగస్వామ్యంతో గుర్తించిన త్రాగునీరు, వీధి దీపాలు, రోడ్లు మొదలగు సమస్యలను ప్రాధాన్యీకరించి, అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరించడంతో పాటు ; సిమెంటు రోడ్లను సర్పంచిగా తనే చేయకుండా ; వేరే వారి ద్వారా చేయించడమనేది తను

తీసుకున్న భాగస్వామ్యం, సమస్య-పరిష్కారం, నిర్ణయాలు చేయడం అనే శిక్షణవల్లనే అని ఆమె తెలిపారు.

తమ గ్రామ పంచాయతీలో కోవిడ్-19 పాజిటివ్ కేసులు అధికంగా వస్తే బెంబేలు చెందకుండా అధికార యంత్రాంగాన్ని సమన్వయ పరచుకొని, వైద్య సిబ్బందిని సమాయత్తపరచి, పాజిటివ్ కేసులున్న ప్రతి ఇంటికి వెళ్ళి, వైద్య సేవలు అందించడం, ప్రభుత్వం తరపున వారికి అందాల్సిన సహకారం అందించడం, పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేసి అవసరమైన వారిని ఐసొలేషన్ సెంటర్‌కి పంపడం, కొవిడ్-19 రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలను చైతన్యపరచడం, మొదలగు కార్యక్రమాల ద్వారా ఒక నెలలోనే కొవిడ్-19 పాజిటివ్ కేసులను జీరో చేయగలిగింది. గ్రామ కమిటీలతో కలసి గడపగడపకు వెళ్ళి ప్రజలను చైతన్యపరచి అర్హత వున్న ప్రతిఒక్కరు కొవిడ్ వాక్సిన్ వేసుకొనే విధంగా ప్రోత్సహించడం, కొవిడ్ వాక్సిన్ చేయించడం, వాక్సిన్ చేసుకోవడానికి నిరాకరించినవారిని, అధికారుల, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఒప్పించి వాక్సిన్ చేయించడం జరిగింది. అందరి సహకారంతో 100 శాతం వాక్సిన్ పూర్తి చేసిన పంచాయతిగా గుర్తిపు పొందుటకు ప్రయత్నిస్తున్నది. అది తను పొందిన విజన్, భాగస్వామ్యం, మానవ-ఆర్థిక వనరుల నిర్వహణ శిక్షణల ప్రభావం చేతనే అని శ్రీమతి ఉషారాణి తెలియజేశారు. కొవిడ్-19 రిలీఫ్ కార్యక్రమంలో కమిటీలు వేయడం, వాటి పని తీరును పరిశీలించ గలుగుతుండడం, ఎఫ్‌పిసి డైరెక్టరుగా అనుభవం గడించడం వల్లనేనని అన్నారు.





చెక్ పవర్ రాకముందే ముందస్తుగా తన స్వంత ధనాన్ని వెచ్చించి ప్రజల అవసరాలు తీర్చిన శ్రీమతి ఉషారాణి , అది అంతా ఎఫ్‌పిసి డైరెక్టరుగా అలవరచుకొన్న జవాబుదారీతనం, అంకితభావం, ఉత్తమ నాయకత్వ లక్షణాల ఫలితమే అని వినమ్రంగా తెలియజేశారు.

తన భర్త నుండి అన్నివిధాల సహకారం అందు తుండడం, తన విధి నిర్వహణను తనే స్వతంత్రంగా నిర్వహించడం (తన విధులలో భర్త జోక్యం చేసుకోక పోవడం) అనేది, ఏపిమాస్‌నుండి పొందిన జెండర్ శిక్షణ ప్రభావం చేతనే నన్నారు. అందులకు ఉదా హరణగా "జెండరు శిక్షణలో చెప్పారుకదా స్త్రీలకూ సమాన అవకాశాలు ఇవ్వాలని, వారి అధికారాలు వారినే నిర్వర్తించ నీయాలని" అని తన భర్త చాలా సందర్భాలలో అంటుంటా రని ఆమె చెప్పారు. ఈ సందర్భంగా తనకెంతో సహకరిస్తున్న భర్తకు, ఇతర కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉషారాణి తన విధులనిర్వహణలో సహకరిస్తున్న స్థానిక ఎంఎల్ఏ గారికి, అధికార యంత్రాగానికి, సచివాలయ సిబ్బందికి, స్థానిక నాయకులకు, గ్రామ ప్రజలకు, ఎఫ్‌పిసి డైరెక్టరుగా అవకాశం ఇచ్చిన ఎఫ్‌పిసి సభ్యులకు, తోటి డైరెక్టర్లకు, శిక్షణల ద్వారా తీర్చిదిద్దిన ఏపిమాస్ వారికి జిఐజడ్, జర్మనీ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఏపిమాస్ 20 వసంతాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా, ఏపిమాస్ బోర్డు సభ్యులకు, సిబ్బందికి, ప్రత్యేకించి సిఇఓ సి.ఎస్.రెడ్డి గారికి ఆమె అభినందనలు తెలిపారు.

ఏపిమాస్ నుండి సామర్థ్యం పెంపుదలలో భాగంగా పొందిన శిక్షణలను ఉపయోగించుకొని తన విధులు-బాధ్యతలను భాగస్వామ్య పద్ధతిలో, పారదర్శకంగా నిర్వహిస్తున్న శ్రీమతి ఉషారాణి మరింత ఉత్తమ నాయకురాలిగా ఎదగాలని, తమ గ్రామ పంచాయతీని ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దాలన్న తన కల (విజన్) నెరవేరాలని ఆశిద్దాం, అభినందనలు తెలుపుదాం. ■

నీవు మంచి చేసినా తోటివారు నిన్ను స్వార్థపరుడని, కుతంత్రుడని విమర్శించవచ్చు; అయినా మంచే చెయ్యి

# మద్యమే గృహహింసలో ప్రధాన విలన్ !

*ఆమె కరోనా కష్టకాలంలో వైద్య సౌకర్యంలేని రెండు వందల పల్లెలకు పెద్ద దిక్కు అయ్యారు. తన బృందంతో కలిసి రోడ్డుమార్గం లేని తండాలకు తరలివెళ్లి, సహాయ చర్యలు చేపట్టారు. ఇప్పుడు ఆ గ్రామాలను 'థర్డ్‌వేవ్'పై అప్రమత్తం చేయడంలో నిమగ్నమయ్యారు. ఆమే 'గ్రామ్య రిసోర్స్ సెంటర్ ఫర్ ఉమెన్' స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు డాక్టర్ విజయ రుక్మిణీరావు. సుదీర్ఘకాలంగా మహిళాభ్యున్నతి లక్ష్యంగా పని చేస్తున్న ఆమె కరోనా సమయంలో తాము అందించిన సేవల గురించీ, గ్రామీణ బాలికలు, మహిళల జీవితాల్లో గమనించిన మార్పుల గురించి ఆంధ్రజ్యోతి 'నవ్య'తో పంచుకున్నారు. ఆ పత్రిక సౌజన్యంతో ఆ విశేషాలు 'మహిళా సాధికారత' పాఠకులకు అందిస్తున్నాం .*

'అమ్మాయిల చదువు కోసం మేమంతా కలిసి ఇన్నాళ్ళూ చేసిందంతా ఒక ఎత్తయితే, ఇకమీదట చేయాల్సింది మరొక ఎత్తు. కరోనా ధాటికి పల్లెలు, తండాలు సైతం అల్లాడాయి. నల్గొండ జిల్లా దేవరకొండ పరిధిలోని ఆరు మండలాల్లో 'గ్రామ్య రిసోర్స్ సెంటర్ ఫర్ ఉమెన్' సంస్థ తరపున ఇరవై రెండేళ్లుగా బాలికలు, మహిళల హక్కుల కోసం పనిచేస్తున్నాం. ఈ విపత్కాలంలో 205 గ్రామాల్లో సహాయ చర్యలు చేపట్టాం. అక్కడ వైద్య సదుపాయాల సంగతి దేవుడెరుగు... రోడ్డు, రవాణా సౌకర్యానికి నోచుకోని పల్లెలు అవి. ఆ ప్రాంతాల్లో... సెకండ్ వేవ్‌లో కోవిడ్ బారినపడిన 583 మందికి ఉచితంగా మందులతో పాటు నిత్యావసర సరుకులను అందించాం. అవసరం మేరకు కొందరికి ఆక్సీమీటర్లు, నెబులైజర్లు పంపిణీ చేశాం. 'శక్తిషిఫా హెల్త్ ఫౌండేషన్'కు చెందిన డాక్టర్ రెహనాతో పాటు యూకేలో ఉంటున్న నా మిత్రులైన నలుగురు వైద్యులతో కలిసి కోవిడ్ హెల్ప్‌లైన్‌ను ఏర్పాటుచేశాం. కొన్ని వందలమందికి ఉచితంగా ఆన్‌లైన్‌లో చికిత్స అందించాం. కరోనా కాలంలో వైద్య సౌకర్యానికి నోచుకోని చాలా గ్రామాలకు, తండాలకు, అలాగే కొన్ని వందలమంది వలస కార్మికులకు 'గ్రామ్య హెల్ప్‌లైన్' అండగా నిలిచింది, సహాయ, సహకారాలు అందించింది.



**వలంటీర్లే సైనికులై...**

ఈ కష్ట సమయంలో మా వలంటీర్లు పదిమంది సరిహద్దుల్లో సైనికుల్లా మారారు. రాత్రీ పగలూ తేడా లేకుండా... ఎక్కడ సమస్య ఉందని తెలిస్తే అక్కడ వాలిపోయే వాళ్లు. ఒకరోజు అచ్చమ్మకుంట తండాలోని ఒకామెకు శ్వాస సరిగ్గా అందడంలేదని మా హెల్ప్‌లైన్‌కు ఫోన్ వచ్చింది. ఆమెకు అత్యవసరంగా ఆక్సిజన్ అందించాలని వైద్యుడు సూచించారు. అంతే! మా వలంటీరు రాము రోడ్డు మార్గం కూడా లేని ఆ తండాకు... మోటార్ బైక్ మీద ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌ను తీసుకువెళ్ళాడు.. పీపీఇ కిట్ ధరించి, వీడియోకాల్ ద్వారా... డాక్టరు రెహనా పర్యవేక్షణలో ఆ కోవిడ్ రోగికి ఆక్సిజన్ అందించి, ప్రాణాలు నిలిపాడు. అలా మా వలంటీర్లు సరైన సమయంలో పలువురికి సహాయం చేయడం వల్ల చాలా జీవితాలు నిలబడ్డాయని గర్వంగా చెప్పగలను.

మరో ఆరుగురిని అత్యవసర పరిస్థితిలో దేవరకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించాం. తర్వాత వారంతా కోలుకున్నారు. కొన్ని ఊళ్లలో కోవిడ్ సోకిన వారిని ఇరుగు పొరుగు కుటుంబాలు వెలివేసినట్లు చూడడం గమనించాం. కరోనా మీద అపోహలే దీనికి కారణం. కనుక వాళ్లలోని భయాలు తొలగించేందుకు ఇంటింటికీ తిరిగి అవగాహన

**కొన్ని సంవత్సరాల నీ కృషిని ఒక్క రాత్రిలో ఎవరో ధ్వంసం చేయవచ్చు ; అయినా కృషి చేస్తూనే వుండు**

కల్పించాం. స్థానిక యువకులతో కలిసి ప్రతి గ్రామంలో కరోనా జాగ్రత్తలపై ప్రచారం చేశాం. దీంతో జనంలో అవగాహన పెరిగింది. వివక్ష చాలావరకు తగ్గింది. ఒక ఇంట్లో ఎవరికైనా పెద్దలకు కోవిడ్ వస్తే, పక్కింటి వాళ్లు ఆ కుటుంబంలోని పిల్లల బాధ్యతను తీసుకోవడం లాంటి పరస్పర సహాయసహకారాలు అందించుకోవడం మేము చూసిన పెద్ద మార్పు.

**మహిళలపై దాడుల నివారణ కోసం...**

తెలంగాణ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సహకారంతో నల్గొండలో మూడేళ్లుగా 'సఖీ సహాయ కేంద్రం' నడుపుతున్నాం. బాధితులైన ఆడపిల్లలకు, మహిళలకు ఈ కేంద్రం అన్ని విధాలా బాసటగా నిలుస్తోంది.. ఇప్పటివరకు 1,500 కేసులు మా దగ్గర నమోదయ్యాయి. లాక్‌డౌన్ కాలంలో మహిళలపై హింస పెరిగిన మాట వాస్తవమే! కానీ కేసులు మాత్రం పెద్దగా నమోదు కాలేదు. అందుకు కారణం కూడా లాక్‌డౌనే అనుకుంటున్నా. ఉపాధి కోసం వలస వెళ్ళిన చాలామంది సొంత ఊర్లకు తిరిగి వచ్చారు. పల్లెల్లో పనులు లేవు. దాంతో రెక్కాడితేకానీ డొక్కాడని కుటుంబాల పరిస్థితి మరీ దయనీయంగా మారింది. ఇదే సమయంలో పనుల్లేక ఖాళీగా ఉన్న మగవాళ్లు చాలామంది తాగుడు, జూదం వంటి వ్యసనాల్లో కూరుకుపోయి జేబులు ఖాళీ చేసుకున్నారు.

అలాంటి వాళ్లు ఇంట్లో బియ్యం నిండుకున్నాయనో, కూరగాయలు తెమ్మనో అడిగిన భార్యమీద చేయి చేసు కోవడం. లేదంటే, కట్నం తీసుకురమ్మని వేధించడం... ఇలాంటి కేసులు కొన్ని మా దృష్టికి వచ్చాయి. మేము పని చేస్తున్న గ్రామాల్లో ప్రతి ఇంటికీ ప్రధాన విలన్ మద్యమే! చాలా కుటుంబాల్లో పురుషులు పీకలదాకా తాగి వచ్చి భార్యను ఇష్టం వచ్చినట్టు కొట్టడం సర్వసాధారణం. పనులు లేని కాలంలో అవి ఇంకా పెరిగాయి. మద్యాన్ని నియంత్రించ కుండా ఈ హింసను నిలువరించడం అసాధ్యం. ఈ సంగతి మహిళా సంఘాల తరపున మేమంతా ఎప్పటి నుంచో చెబుతున్నాం. అయినా, వినేదెవరు? కనీసం ప్రతి జిల్లాకు ఒక డీ-అడిక్షన్ కేంద్రాన్నయినా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని అడుగుతున్నాం. అలాగే నిరుపేద, ఒంటరి మహిళలకు ఏడాది పొడుగునా ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని కోరుతున్నాం.

## వారే కొండంత బలం!

**"క**రోనా థర్డ్ వేవ్‌పై పల్లెలను, తండాలను అప్రమత్తం చేస్తున్నాం. ఆ క్రమంలో 'రైతు స్వరాజ్య వేదిక'తో కలిసి క్షేత్రస్థాయి కార్యాచరణ రూపొందించాం. గ్రామ సర్పంచ్‌లు, స్థానిక అంగన్వాడీ, 'ఆశా' వర్కర్లు, ఎఎన్ఎం లతో కలిసి మా కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతున్నారు. కరోనా నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నారు. టీకా ప్రాధాన్యాన్ని వివరిస్తున్నారు. దేవరకొండలో ఇరవై ఏళ్ల కిందట ఉచిత పాఠశాల నెలకొల్పాం. మేము చేపట్టిన ప్రతి కార్యక్రమానికి ఆ స్కూలు పూర్వవిద్యార్థులు తోడ్పాటు అందిస్తున్నారు. వారే మాకు కొండంత బలం."

**ఎంతోమంది చదువుకు దూరం....**

అమ్మాయిల అభ్యున్నతికి కరోనా అడుగడుగునా అవరోధాలను సృష్టించింది.. రెండేళ్లుగా బడులు లేవు. ఆన్‌లైన్ తరగతులకు హాజరయ్యే స్థోమత అందరికీ ఉండదు. ఒక పేద, మధ్యతరగతి ఇంట్లో అమ్మాయి, అబ్బాయి ఉంటారు. కానీ స్మార్ట్ ఫోన్ ఒక్కటే ఉంటుంది. అప్పుడు ఆ ఫోన్ అబ్బాయికే ఇస్తారు కదా! అలా పేదింటి అమ్మాయిలు చాలామంది చదువుకు దూరమవుతున్నారు. ఇదే అదునుగా కొందరు బాల్య వివాహాలు చేస్తున్నారు. ఈ ఏడాదిలో పదిహేను పెళ్లిళ్లను ప్రత్యక్షంగా మేమే అడ్డుకున్నాం. 'ఆడపిల్లకు చదువుకన్నా పెళ్లి ముఖ్యం' అని కుటుంబమే కాదు, ప్రభుత్వాలూ విశ్వసిస్తున్నాయి. కనుకే 'కల్యాణలక్ష్మి', 'షాదీ ముబారక్' లాంటి పథకాల ద్వారా అమ్మాయిల పెళ్లిళ్లకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. అదే ఒక అమ్మాయి చదువుకోవడానికి మాత్రం అవకాశాలు కల్పించరు.

దేశంలోనే తొలి మహిళా పాలిటెక్నిక్ అయిన నాంపల్లిలోని 'కమలా నెహ్రూ కళాశాల'ను నిధుల కొరతతో మూసేస్తున్నారు. ఈ 'పెళ్లి పథకాల' డబ్బును కాలేజీల నిర్వహణకు ఖర్చుపెడితే, అమ్మాయిలు బాగా చదువుకొని,

# చిటికెలో సన్నజీవాలను చంపే చిటుకు రోగం!

– లిఖిత శ్రీరాం

**చి**త్తూరు, అనంతపురం జిల్లాల్లో కొంత మంది రైతులకు సన్నజీవాల (మేకలు, గొర్రెలు) పెంపకం అనేది ఒక ముఖ్యమైన వృత్తి. ఈ రెండు ప్రాంతాల్లో సన్న జీవాల పెంపకం ద్వారా దాదాపు 40 శాతం రైతు కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. మేకలు, గొర్రెల పెంపకంలో ఆదాయం పొందడానికి వాటికి ఎలాంటి వ్యాధులు రానివ్వకుండా తగిన జాగ్రత్త తీసుకోవాలి. జీవాలను పరిశుభ్రమైన పరిసరాలలో ఉంచాలి. మంచి మేత, నీరు అందించాలి. ముందు జాగ్రత్త చర్యగా టీకాలు కూడా వేయించాలి. దీనివలన మంద ఆరోగ్యంగా ఉండి మరణాలు సంభవించకుండా జాగ్రత్తపడినట్టవుతుంది.

ప్రతీఏటా జీవాలలో వచ్చే రకరకాల వ్యాధుల వల్ల గొర్రెలు, మేకలను పెంచే రైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారు. సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో గడ్డి



అందుబాటులో లేనందున, తక్కువగా తిని జూన్, జులై నెలలలో తొలకరి జల్లులకు పొలాల్లో వచ్చే పచ్చగడ్డిని ఎక్కువగా తింటే చిటుకు వ్యాధి (ఎంటరో టాక్సామియా/ పల్పీ కిడ్నీ డిసీజ్) వస్తుంది. ఎండు గడ్డి తిన్నా కూడా ఈ వ్యాధి రావచ్చు. దీన్ని గడ్డి రోగం, ముచ్చు వ్యాధి, పోటు రోగం, మెడ నరం, నెత్తి పిడుగు వ్యాధి అని కూడా అంటారు. ఇది సోకిన కొద్ది సేపటిలోనే పశువులు మరణిస్తాయి. అందువలన ఈ రోగాన్ని చిటుకు రోగం అని కూడా అంటారు.

**వ్యాధి కారణాలు**

ఈ రోగం బాక్టీరియా వలన వ్యాపిస్తుంది. జీవాలు ఉన్నవి ఉన్నట్టుగా (ఎక్కువగా ఉదయం, మధ్యాహ్న సమయాల్లో) చనిపోతాయి . ఎక్కువగా గొర్రెల్లో వచ్చే ఈ వ్యాధి మేకలలో అరుదుగా వస్తుంది. సంవత్సరం వయసులో ఉన్న కొదమలకు, పాలు ఎక్కువగా త్రాగే పిల్లలకు ఈ వ్యాధి సోకుతుంది. జీవాలకు ఇతర వ్యాధులు సోకినప్పుడు, వ్యాధి నిరోధక శక్తి తగ్గినప్పుడు, పరాన్నజీవులు ఎక్కువగా కడుపులో ఉన్నప్పుడు, పొట్టేళ్ళలో బద్దె పురుగులు వున్నప్పుడు, ఎక్కువ గడ్డి మేసినప్పుడు, పేగుల్లో కదలిక లేనప్పుడు ఈ వ్యాధి సోకుతుంది.

---

సమాజాభివృద్ధిలో భాగస్వాములవుతారు. పథకాలు కావలసింది ఆడపిల్ల చదువుకి కదా!

కుటుంబ ఆర్థిక సమస్యల వల్ల బాలికలు నిర్లక్ష్యానికి, నిరాదరణకూ లోనవుతున్నారు. అమ్మాయిలు ఏదన్నా కావాలని అడిగితే పెద్దవాళ్లు కసురుకుంటారు. అదే సమయంలో ఎవరైనా అబ్బాయి పరిచయమై, కాస్తంత ప్రేమగా మాట్లాడితే వాళ్లను నమ్మేస్తున్నారు. ఆ వ్యక్తితో జీవితం పంచుకోవాలనే ఆశతో ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోతున్నారు. అలాంటి కేసులు ఈమధ్య బాగా పెరిగాయి. ఇప్పుడు ఆడపిల్లల్ని పనుల్లో పెట్టడమూ ఎక్కువగా చూస్తున్నాం. దానివల్ల చదువుకు దూరమయ్యేవాళ్ల సంఖ్య రానురాను మరింత పెరగవచ్చు. ఇక, ఇంటిపట్టునే ఉంటున్న అమ్మాయిల మీద కూడా లైంగిక హింస తక్కువేమీ కాదు. కన్నతండ్రే కూతుళ్ల మీద అకృత్యానికి పాల్పడిన కేసులు మూడు మా వద్దకు వచ్చాయి. అంత దయనీయంగా మారింది అమ్మాయిల పరిస్థితి. మాలాంటి వాళ్ళు మరింత బలంగా పనిచేయాల్సిన సమయం ఇది.

■

**అయిదారేళ్ల పిల్లలకు అర్థమయ్యేటట్టు చెప్పలేకపోతే ఆ విషయం నీకే అర్థం కాలేదన్న మాట**



పశువులు తొలకరి గడ్డి ఎక్కువ మేసినప్పుడు కొన్ని క్రిముల కారణంగా వాటికి కడుపు నొప్పి, ఉబ్బరము వచ్చి, ఆహారంలో విషపదార్థాన్ని విడుదల చేస్తాయి. ఈ కారణంగా పశువులు మూర్ఛ వచ్చి ఎగిరి కింద పడిపోయి చనిపోతాయి.

**లక్షణాలు :**

- జీవాల పేడ పలుచగా వుంటుంది, వాటికి కడుపులో నొప్పి ఉంటుంది, కాళ్ళతో పొట్టను తన్నుకుంటాయి.
- జ్వరం, వణుకు వుంటుంది. తలను చెట్టుకు కాని, నేలకు కానీ ఆనించి ఉంచుతాయి.
- కొన్నిసార్లు ఎలాంటి వ్యాధి లక్షణాలు కనిపించకున్నా కూడా, పైకి ఎగిరి క్రింద పడి క్షణాల్లో మరణిస్తాయి.
- రాత్రిపూట ఆరోగ్యంగా ఉండి ఉదయాన్నే ఎక్కువ సంఖ్యలో మరణిస్తాయి.

**చికిత్స:**

వ్యాధి సోకిన తర్వాత వైద్యం అందించే సమయం ఉండదు కాబట్టి ముందుగానే లక్షణాలను గమనించి విరేచనాలకు, పొట్ట ఉబ్బరానికి యాంటిబయోటిక్ మందులను జీవాలకు నోటి ద్వారా అందించాలి.

**నివారణ**

- పశువులకు తొలకరి గడ్డి తక్కువగా మేపాలి. కేవలం 4 గంటలు మాత్రమే గడ్డి మేపాలి.
- పాలు తక్కువగా త్రాగేట్టు చూడాలి.
- మేత నుండి దాణాకు దశల వారిగా మార్చాలి. దాణా తక్కువగా ఇవ్వాలి.
- కడుపులో ఉండే పురుగులకు నట్టల నివారణ మందులు వాడాలి.
- నివారణగా క్రింది పట్టిక ప్రకారం టీకాలు వేయించాలి.

| టీకా మందు | సమయం | మోతాదు / వయస్సు |
|---|---|---|
| మశూచి (షీప్ అండ్ గోట్ పాక్స్) | ఫిబ్రవరి | 3 నెలలు దాటిన పిల్లల నుంచి 2.5 మి.లీ చర్మం క్రింద |
| పి.పి.ఆర్.వ్యాధి (ముసర వ్యాధి) | జనవరి | |
| గొంతువాపు (హెచ్ ఎస్) | మార్చి/ ఆగష్టు (ఏడాదికికి 2 సార్లు) | 3 నెలలు దాటిన పిల్లల నుంచి 2.5 మి.లీ చర్మం క్రింద |

- ప్రతి సంవత్సరం మే నెలలో టీకాలు (ET వ్యాక్సిన్) వేయించాలి.
- తప్పనిసరిగా 15 రోజుల తరువాత బూస్టర్ డోస్ వేయించాలి.

### గాలికుంటు (కాలికి, నోటికి వచ్చే) వ్యాధి

గొర్రెల నుండి అధిక లాభాలు పొందేందుకు అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో అనువైనదిగా “నెల్లూరు” జాతిని పెంచుతున్నారు. కానీ పశువులకు సోకే వివిధ వ్యాధుల పట్ల రైతులు జాగ్రత్త వహించాలి. ఎందుకంటే వ్యాధుల వల్ల పశువులలో శక్తి, పునరుత్పత్తి, పాల ఉత్పత్తి తగ్గిపోతుంది. ఇటువంటి వ్యాధులలో ముఖ్యమైనది గాలికుంటు వ్యాధి. ఈ వ్యాధి వర్షాకాలంలో పశువులకు సోకుతుంది కాబట్టి రైతులంతా అప్రమత్తంగా ఉండాలి.

ఈ వ్యాధి సోకడం వల్ల లేగదూడలు, పెయ్యలు, పడ్డలు ఎక్కువ సంఖ్యలో మరణిస్తాయి, పాడి పశువులలో పాల దిగుబడి తగ్గి ఆర్థిక నష్టం కలుగుతుంది. చూడి పశువులలో పిండం పడిపోవచ్చు. వ్యాధినుండి తేరుకున్నా కూడా పశువులు సకాలంలో చూడి కట్టవు. కాబట్టి వ్యాధులు రాకముందే సరైన సమయంలో రోగనిరోధక టీకాలు వేయించడం వల్ల పశువులను కాపాడుకోవచ్చు.

**జీవితమంటే నిన్ను నీవు తెలుసుకోవడం కాదు , నిన్ను నీవు మలచుకోవడం**





పుళ్ళు ఏర్పడతాయి. కాళ్ళ గిట్టల మధ్య పుళ్ళు ఏర్పడతాయి.

⇨ నోటి నుండి చొంగ కారుతుంది,దగ్గుతాయి.

⇨ నోటిలో నొప్పి వలన మేత మేయవు.

**వ్యాధి కారణాలు**

ఈ వ్యాధి వైరస్ వలన వ్యాపిస్తుంది. ఇది అంటువ్యాధి. ఈ వ్యాధి సోకిన పశువులలో ఉత్పాదకత, అనారోగ్యం నుండి కోలుకునే శక్తి తగ్గుతాయి. ఈ వ్యాధిని గాలి అమ్మోరు, అమ్మ తల్లి వ్యాధి, పోచమ్మ రోగం, నోటి గాళ్ళు, కాళ్ళ గాళ్ళు అని కూడా అంటారు. ఈ సమస్య సంవత్సరంలో ఎప్పుడైనా రావచ్చు. వ్యాధి నిరోధకత తక్కువగా ఉన్న ఆవులకు, ఎద్దులకు, బర్రెలకు, గొర్రెలకు ముఖ్యంగా వర్షాకాలంలో సోకే అవకాశం ఎక్కువ.

**వ్యాధి వ్యాప్తి:**

1. నోరు, కాలి వ్యాధికి గురైన పశువుల లాలాజలం, పాలు, పుండ్లనుంచి కారే రసిలాంటి విసర్జనల వల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుంది.
2. ఈ వ్యాధికారక క్రిమి ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి గాలి ద్వారా వ్యాప్తి చెందుతుంది.
3. వ్యాధి పీడిత పశువుల నుంచి ఆరోగ్యంగా ఉన్న వాటికి కలుషిత ఆహారం, నీరు, వ్యవసాయ పనిముట్లు మొదలైన వాటి వల్ల, అలాగే కుక్కలు, పక్షులు, పొలం పనివారి రాకపోకల వల్ల కూడా వ్యాధి సంక్రమిస్తుంది
4. వ్యాధిపీడిత పశువులను ఒకచోటి నుంచి మరొకచోటికి రవాణా చెయ్యటంవల్ల కూడా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది

**లక్షణాలు**

⇨ జ్వరము 104 నుండి 106° F వరకు ఉంటుంది

⇨ పళ్ళ చిగుళ్ళు, నాలుక, ముట్టెలోపలి భాగాలలో

⇨ కుంటుతూ నడుస్తాయి.

⇨ పొదుగుపై బొబ్బలు ఏర్పడతాయి, పొదుగు వాపు వస్తుంది, పాల దిగుబడి తగ్గుతుంది.

⇨ చూడి పశువులు, గొర్రెలు ఈసుకుపోతాయి.

⇨ గిట్టలు వూడి పడిపోతాయి.

⇨ 90% గొర్రెపిల్లలు మరణిస్తాయి.

**చికిత్స**

నోటిలో, గిట్టల మధ్య ఏర్పడే పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణం లేదా బోరిక్ యాసిడ్ ద్రావణం లేదా ఆక్రిఫ్లేవిన్ వంటి యాంటి సెప్టిక్ ద్రావణాలతో శుభ్రపరచాలి. నోటిలోని పుండ్లకు బూరోగ్లిసరిన్ను పూయాలి. అదేవిధంగా గిట్టల మధ్య పుండ్లకు సల్ఫర్ ఆయింట్‌మెంట్‌ను పూయాలి. గంజిని త్రాగించాలి.

**నివారణ**

⇨ వ్యాధి సోకినపశువులను మందనుండి వేరుచేయాలి.

⇨ గాలి కుంటు వ్యాధి టీకా, లేదా రక్షా ఎఫ్.ఎమ్.డి. టీకాను 6 నెలల వయసులో మొదటి డోస్ ఇవ్వాలి.

⇨ మొదటి డోస్ తిరిగి ప్రతి 6 మాసాల కొకసారి చర్మం క్రింద ఇప్పించాలి.

⇨ పశువుల శాలలను క్రిమిసంహారక మందులతో సోడియం హైడ్రాక్సైడ్, 2 శాతం ఫార్మాలిన్. 4 శాతం సోడియం కార్బోనేట్ వంటి మందులతో శుభ్రం చేయడం వలరీ వ్యాధి కారక వైరస్ నశిస్తుంది.

■

**అందరూ ఘనకార్యాలు చేయలేకపోవచ్చు,కాని ప్రతి ఒక్కరూ ఏదో ఒక చిన్నపనిని అంకితభావంతో చేయవచ్చు కదా!**

# సులువైన ఆదాయ మార్గం పెరటి కోళ్ళ పెంపకం !

– డా.భార్గవి

**క**రువు పరిస్థితుల్లో వ్యవసాయం, పాడి పరిశ్రమ తరువాతి స్థానం పెరటి కోళ్ళ పెంపకానిది. గ్రామీణ మహిళల ఆదాయాన్ని పెంచే అంశాలలో ముఖ్యమైనది పెరటికోళ్ళ పెంపకమే. దేశవాళీ కోళ్ళ పెంపకం ద్వారా ఆ కుటుంబం ఆర్థిక పరిపుష్టి, పౌష్టికాహార పరిస్థితిని పెంచవచ్చు. దేశవాళీ కోళ్ళు వ్యాధినిరోధ శక్తిని కలిగి ప్రతికూల పరిస్థితిని సైతం తట్టుకోగలవు. పెరటి కోళ్ళ పెంపకం వల్ల అటు మాంసం, ఇటు గుడ్ల ద్వారా ఆదాయం పొందవచ్చు. మేతలో జాగ్రత్తలు పాటిస్తే సరిపోతుంది. అందుకే మహిళా రైతులను ప్రోత్సహించడం కోసం 'మహిళా అభివృద్ధి సొసైటీ'





(ఏపిమాస్), 'అరబిందో ఫార్మా ఫౌండేషన్', 'పీలేరు రైతు ఉత్పత్తిదారుల కంపెనీ' సంయుక్తంగా 90 మంది మహిళా రైతులకు 45రోజుల వయస్సుగల నాటుకోడి పిల్లలను ఒక్కొక్కరికి 20 చొప్పున పంపిణీ చేశాయి.

**పెట్టుబడిలేని పెంపకం**


గ్రామాల్లోని మహిళలు, రైతు కూలీలు పెరటి కోళ్ళ పెంపకాన్ని చేపట్టడానికి చాలా అనుకూలంగా ఉంటుంది. ఎందుకంటే ఇవి ఆరుబయట తిరిగి ఆహారాన్ని సమకూర్చు కుంటాయి. వ్యవసాయ వ్యర్థాలను మేతగా వేస్తే సరిపోతుంది. ఫారాల్లో పెంచే కోళ్ళ గుడ్లు, మాంసం కంటే పెరటి కోళ్ళ ద్వారా వచ్చే గుడ్లు, మాంసం ఎక్కువ పౌష్టికాహారాన్ని కలిగివుంటాయి. ఆరుబయట తిరుగుతూ పెరగడం వల్ల కోళ్ళ మాంసంలో కొవ్వు శాతం తక్కువగా ఉంటుంది. వీటి మాంసం రుచిగా ఉంటుంది, ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరం. వీటి ద్వారా కనీస పెట్టుబడితో స్వల్ప కాలం లోనే లాభాలను పొందవచ్చు.

**పెంపకంలో మెళకువలు**

గ్రామీణులు 10 నుంచి 20 కోళ్ళను ఒక సమూహంగా ఆరుబయట స్వేచ్ఛగా పెంచుకోవచ్చు. సహజమైన మేత పెడితే సరిపోతుంది. ఆరు వారాల వరకు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. వెదురుగడ్డి, చెక్కల వంటి స్థానికంగా లభించే వనరులతో వీటికి వసతి ఏర్పాటు చేయ వచ్చు. 4 నుంచి 8 వారాల్లోపు పిల్లలకు ఒక చదరపు అడుగు, 8 నుంచి 12 వారా ల్లోపు వాటికి రెండు చదరపు అడుగుల స్థలం కేటాయిస్తే సరిపోతుంది. కోళ్ళు విసర్జించే వ్యర్థాల నుంచి ఏర్పడే తేమను పీల్చుకోవడానికి, వేసవిలో చల్లదనం కోసం రంపపు పొట్టును లేదా వరిపొట్టును లిట్టర్‌గా వాడుకోవాలి. 5 నుంచి 10 సెంటీమీటర్ల మందంగా పొట్టును పరచి తరచూ సర్దుకోవాలి.

ఈ రకం కోళ్ళకు న్యూ కాస్టల్, ఫౌల్ ఫాక్స్ వంటి వ్యాధుల ముప్పు పొంచి ఉంటుంది. వీటి నివారణకు 8 నుంచి 9 వారాల పిల్లలకు టీకాలు వేయించాలి. ఈ రకం కోళ్ళు 42 రోజుల వయస్సులో 650 నుంచి 750 గ్రాముల బరువు పెరుగుతాయి. పెట్టకోళ్ళను గుడ్ల ఉత్పత్తి కోసం వేరు చేయాలి. 20 నుంచి 10 కోళ్ళ గుంపులో ఒకటి నుంచి రెండు పుంజులు ఉండేలా చూడాలి. ఆరు బయట ఉండటం వలన పరాన్న జీవుల సమస్య వచ్చే అవకాశం ఉన్నందున రెండు మూడు నెలల మధ్య నట్టల నివారణ మందులు వాడాలి. ■

# రక్తహీనతను అధిగమించడం ఎలా?



ఎర్ర రక్తకణాలు ... సాధారణ స్థాయిలో ... రక్త హీనతలో...

**ఆ**రోగ్యంగా ఉండటం అంటే కేవలం జబ్బులు లేకుండా ఉండటం మాత్రమే కాదు, మానసికంగా, శారీరకంగా, ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండటం కూడాను. మన దేశంలో దాదాపుగా 75% మహిళలు రక్తహీనతతో బాధపడ్తున్నారు. స్త్రీలలో రక్తహీనతకు గల ముఖ్య కారణం సరైన పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోకపోవడమే. భారతదేశంలో కిశోర బాలికలు, స్త్రీలు రక్తహీనత (అనీమియా)తో బాధపడడం సర్వసాధారణం. రక్తహీనత, దానికి గల కారణాలు ఏవిధంగా గుర్తించాలి, అధిగమించాలంటే ఏం చేయాలో ఈ వ్యాసంలో చూద్దాం....

**రక్తహీనత అంటే ఏమిటి?**

మన రక్తంలో ఉండాల్సిన హిమోగ్లోబిన్ అనే పదార్థం ఉండాల్సిన స్థాయి కన్నా తక్కువగా ఉండటమే రక్తహీనత.

**స్త్రీలలోనే ఎందుకు ఉంది, పురుషులలో ఎందుకు లేదు?**

♦ ప్రాణవాయువును ఊపిరితిత్తుల నుంచి శరీరంలోని వివిధ అవయవాలకు సరఫరా చేయటానికి రక్తం చాలా అవసరం.

⇨ ఎర్ర రక్తకణాలు (ఆర్.బి.సి) ప్రాణవాయువును సరఫరా చేస్తాయి. ఈ ఎర్ర రక్తకణాలలోని హిమోగ్లోబిన్‌లో ఇనుము, ప్రొటీన్లతో కూడిన అణువులు వుంటాయి.

⇨ హిమోగ్లోబిన్ అనేది ఒక ప్రొటీన్. ఎర్ర రక్త కణాల్లో తగినంత హిమోగ్లోబిన్ లేకపోతే, రక్తంలో ఆక్సిజన్ శాతం తగ్గి, అది రక్తహీనతకు దారి తీస్తుంది.


⇨ ఆ హిమోగ్లోబిన్‌కు అవసరమైన ఇనుము మన ఆహారం ద్వారా లభ్యమవ్వాలి. మన శరీరానికి కొన్ని మిల్లీ గ్రాముల ఇనుము అవసరముంటుంది.

⇨ రక్త పరీక్షలో (ఆర్.బి.సి. సంఖ్యలో) హిమోగ్లోబిన్ మోతాదు తక్కువగా ఉన్నట్లయితే దానిని రక్తహీనతగా నిర్ధారిస్తారు.

⇨ స్త్రీలు రక్తహీనతకు గురి కావడానికి ముఖ్య కారణం వారి నెలసరి ఋతుస్రావం.

⇨ గర్భంతో ఉన్నప్పుడు, ప్రసవ సమయంలోకూడా రక్తహీనతకు గురయ్యే అవకాశం ఎక్కువ.

⇨ పురుషులకు పై సమస్యలు లేవు కనుక వారిలో రక్తహీనత అరుదు. కానీ పురుషులలోనూ మూత్ర పిండాల సమస్య కానీ, మలేరియా కానీ, వస్తే రక్తహీనతకు గురి అవుతారు.



**కారణాలు**

⇨ శరీరానికి తగినంత పరిమాణంలో ఇనుము లభించనప్పుడు రక్తహీనత కలుగుతుంది.

⇨ ఎర్ర రక్తకణాలు సరిగా ఏర్పడకపోవడం వలన కూడా రక్తహీనత కలుగుతుంది. దీనినే మెగాలోబాస్టిక్ అనేమియా అంటారు.

**నీవు భయం అనుకునే పని ఏదో ఒకటి ప్రతిరోజూ చేస్తుండు, చివరకు నిన్ను మించిన ధైర్యవంతుడు వుండడు**

**తినుబండారాలు - ఇనుము పరిమాణం**
**(100 గ్రాములకు)**

| | | |
|---|---|---|
| రాగులు | - | 8 మి.గ్రా |
| మరమరాలు | - | 6.6 మి.గ్రా |
| పుట్నాల పప్పు | - | 9.5 మి.గ్రా |
| ఉలవలు | - | 6.8 మి.గ్రా |
| శనగలు | - | 8.6 మి.గ్రా |
| సోయాబీన్స్ | - | 10.4 మి.గ్రా |
| బీట్‌రూట్ ఆకులు | - | 16.2 మి.గ్రా |
| తమలపాకులు | - | 10.6 మి.గ్రా |
| గంగవాయిల కూర | - | 14.8 మి.గ్రా |
| ఎండు సుందకాయ | - | 22.2 మి.గ్రా |
| ఎండు కలువకాడలు | - | 60.6 మి.గ్రా |
| నల్ల నువ్వులు | - | 56.7 మి.గ్రా |
| జీలకర్ర | - | 11.7 మి.గ్రా |
| పుచ్చకాయ | - | 7.9 మి.గ్రా |
| ఎండు ఖర్జూర | - | 7.3 మి.గ్రా |
| నూనె తీసిన ఎండు కొబ్బరి | - | 69.4 మి.గ్రా |

అన్ని మసాలా దినుసులలోను ఇనుము ఉంటుంది. పై పదార్థాలను రోజూ ఆహారంలో గ్రహించడం ద్వారా సులభంగా రక్తహీనత నుండి స్త్రీలు తమని తాము కాపాడుకోవచ్చు.

- విటమిన్ బి (ఫోలిక్ ఆసిడ్), విటమిన్-సి, ప్రొటీన్ లోపం వలన కూడా రక్తహీనత కలుగుతుంది.

**స్త్రీలలో రక్తహీనతకు గల కారణాలు...**

- ఋతుస్రావం
- కాపర్ 'టి' ఉపయోగం వలన వారికి నెలసరి సమయంలో అధిక రక్తస్రావం కావడం
- గర్భసంచి (యుటరస్) లో కణుతులు వుండడం
- మనదేశంలో 87.6% గర్భిణులు చివరి త్రైమాసికంలో అధిక రక్తహీనతకు గురవుతున్నట్టు అధ్యయనాలు పేర్కొంటున్నాయి
- ఇంకా మలేరియా, మూత్ర పిండాల సమస్యలు, కడుపులో నులిపురుగులు వుండడం

**రక్తహీనతను మనం ఎలా గుర్తిస్తాం?**

- రక్త పరీక్ష ద్వారా (ఆర్.బి.సి కౌంట్) నిర్ధారించవచ్చు. ఈ క్రింది లక్షణాలు రక్తహీనత ఉన్నట్లు గుర్తించవచ్చు.
- నీరసంగా ఉండటం
- కళ్ళు తిరగటం
- ఉన్నట్లుండి చీకట్లు కమ్మడం
- త్వరగా అలసిపోవడం
- ఏ పనిలోను శ్రద్ధ పెట్టలేకపోవడం
- కీళ్ళ నొప్పులు ఉండటం

**రక్తహీనతను నివారించడం ఎలా ?**

- పప్పులు, ఎండబెట్టిన పళ్ళు, ఖర్జూరం, పుచ్చకాయ, పచ్చని కూరగాయలు, ఆకుకూర, గుడ్లు, మాంసం, చేపలు, కోళ్ళ ఉత్పత్తుల నుండి ఇనుమును పొందవచ్చు.

  విటమిన్-సి బాగా ఉన్న నిమ్మ, ఉసిరి, జామ, నారింజ లాంటి పుల్లటి పళ్ళు, శరీరం ఇనుమును గ్రహించడాన్ని మెరుగుపరుస్తాయి.
- శాకాహార పదార్థాల నుండి ఇనుము తక్కువగా, జంతు సంబంధ పదార్థాల నుండి ఎక్కువగా గ్రహించబడుతుంది.
- టీ లాంటి పానీయాలు ఆహారంలోని ఇనుముతో కలిసిపోయి, శరీరానికి ఇనుము అందకుండా చేస్తాయి. అలాంటి పానీయాలను భోజనానికి ముందు, భోజనం చేస్తున్నప్పుడు లేదా భోజనమైన వెంటనే గానీ తీసుకోరాదు.

■

**జీవితంలో ఏనాడూ తప్పు చేయలేదంటే ఏనాడూ ఏ కొత్తపనీ చేయలేదన్న మాట !**

# స్వయం నియంత్రణ సాధిస్తున్న సుస్థిరాభివృద్ధి

– తోమల కిషోర్

స్వయంసహాయ సంఘాలకు, సమాఖ్యలకు స్వయం సమృద్ధితో, సుస్థిరంగా పనిచేసే శక్తి సామర్థ్యాలు వున్నాయి. అయితే స్వయంసమృద్ధిని, సుస్థిరతను సాధించాలంటే, ఇవి తమ అంతర్గత సామర్థ్యాలను పెంచుకుని, విధానాలను మెరుగుపరచుకుని, మరింత జవాబుదారీతనాన్ని సంతరించుకుని, సభ్యులకు గరిష్ట స్థాయిలో ప్రయోజనం చేకూర్చే విధంగా వ్యవహరించవలసి వుంది. ఇందుకోసం అవి స్వయం నియంత్రణ విధానాన్ని పాటించడం అవసరం. స్వయం సహాయ వ్యవస్థలో తగిన స్వయం నియంత్రణకు దోహదం చేసే ఒక ప్రయోగాత్మక పథకాన్ని ఏపిమాస్ ప్రారంభించింది.

జర్మనీకి చెందిన డిజిఆర్ఏ సంస్థ, మన రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), ఇందిరా క్రాంతిపథం (ఐ.కె.పి), నిజామాబాద్ జిల్లాలోని డి.ఆర్.డి.ఏ.ల సహకారంతో, నిజామాబాద్ జిల్లా కామారెడ్డి క్లస్టర్‌లోని స్వయం సంఘాలు, వాటి సమాఖ్యలకు సంబంధించి ఏపిమాస్ ప్రయోగాత్మకంగా, ఈ స్వయం నియంత్రణ ఉద్యమాన్ని చేపట్టింది. స్వయంసహాయక సంఘాలు వాటి సమాఖ్యలలోని సభ్యులు, నాయకులు తమ సామర్థ్యాలను పెంచుకోవడం ద్వారా, వారి సంస్థలను వారే సమర్థంగా నిర్వహించుకోవడం ఈ స్వయం నియంత్రణ ఉద్యమ లక్ష్యం.

కామారెడ్డి క్లస్టర్‌లో ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళడానికి 6 మండల సమాఖ్యల పదాధికారులు ఒక సమన్వయ సంఘంగా ఏర్పడి, ఉద్యమ ప్రణాళికలను తయారుచేస్తూ ఎప్పటికప్పుడు కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. ఈ కమిటీకి ఒక అధ్యక్షురాలిని, ఒక కార్యదర్శిని ఎన్నుకున్నారు. ఏపిమాస్, ఐకెపి ఈ కమిటీకి ఎప్పటికప్పుడు తగిన సలహా సంప్రదింపులను అందిస్తున్నారు.

దేశంలోనే మొదటిసారిగా, ప్రయోగాత్మకంగా చేపట్టిన ఉద్యమం కావడంతో, స్వయం నియంత్రణ ఉద్దేశ్యాలను, కార్యక్రమాలను, అమలు విధానాన్ని, పనితీరు సూచికలను తయారుచేసి, వాటి ఆధారంగా పని చేస్తున్నారు. కార్యక్రమాలను ఒక దాదాపు ప్రచారరూపంగా ముందుకు తీసుకొని పోవాలని నిర్ణయించి, అందుకు అనుగుణంగా ఇప్పటివరకు అనేక కార్యక్రమాలకు రూపకల్పన చేశారు.

**స్థూల ఉద్దేశము :**

స్వయం సహాయ సంఘాల ఉద్యమ అభివృద్ధికి, సుస్థిరతకు దోహదపడడం, దానిని బలోపేతం చేయడం.

**ప్రధాన ఉద్దేశ్యములు :**

1. సభ్యుల ఆర్థిక, సామాజిక అభివృద్ధి
2. సుస్థిర, ప్రజాస్వామిక చట్టబద్ధ వ్యవస్థను ఏర్పరచడం

**ఉప ఉద్దేశములు :**

1. సభ్యుల పొదుపులకు భద్రత కల్పించడం
2. స్థిర వృద్ధి గల పొదుపు పరపతి సేవలు కల్పించుట
3. సభ్యులలో ఆర్థిక సాక్షరత సాధించుట
4. సంస్థ వనరుల సంరక్షణ, అభివృద్ధి
5. సభ్యులలో సమానత పాటించుట
6. లాభదాయక వ్యవస్థ
7. జవాబుదారీ వ్యవస్థగా రూపొందుట

**ప్రయోగ పరిధి :** నిజామాబాద్ జిల్లా కామారెడ్డి క్లస్టర్‌లోని 5 మండల సమాఖ్యలు, 167 గ్రామసంఘాలు, 5661 స్వయం సహాయ సంఘాలు, 75000 సభ్యులు.

**సమన్వయ కమిటీ :**

6 మండల సమాఖ్యల పదాధికారులందరు కలిసి ఏర్పాటు చేసుకున్న కమిటీ ఇది. ఈ కమిటీ ముఖ్యంగా నిర్వహణ విధానాలను, స్వయం నియంత్రణ ఉద్యమ కార్యాచరణ ప్రణాళికను, అంతర్గత నియంత్రణ విధానాలను, ప్రమాణాత్మకమైన పనితీరు సూచికలను తయారుచేసి, వీటి

**అబద్ధం వెనుక నక్కి తప్పించుకోవడం కంటె నిజంతో తలపడి దెబ్బతినడమైనా మంచిదే !**

అమలులో మండల సమాఖ్యలకు ఎప్పటికప్పుడు సలహాలను అందిస్తున్నది.

**సలహా కమిటీ :**

సమన్వయ కమిటీకి సలహాలను, సహకారాన్ని అందించాలనే ప్రధాన ఉద్దేశ్యంతో ఐకెపి మరియు ఏపిమాస్ ప్రతినిధులు కలిసి ఒక సలహా కమిటీగా ఏర్పడ్డారు. ఈ సలహా సంఘం ప్రధానంగా ఈ ఉద్యమానికి కావలసిన పుస్తకాలను, కరదీపికలను, ఇతర సామాగ్రిని తయారు చేయడం, వాటిపై సమన్వయ కమిటీలో చర్చించి, వారి ఆమోదం తరువాత వాటిని పూర్తిస్థాయిలో తీసుకురావడం, కమిటీ సభ్యులకు సామర్ధ్యాలను పెంపొందించే శిక్షణలను అందించడం, విజన్ యాత్రలను ఏర్పాటు చేయడం, స్వయం తనిఖీ, స్వయం పర్యవేక్షణ, స్వయం నియంత్రణ విధానాలను నేర్పించడం, సంస్థ సొంత వనరుల సమీకరణ, చట్టబద్ధమైన కార్యక్రమాలను నిర్వహించడం తదితర అంశాల విషయంలో అవసరాన్ని బట్టి సహకారాన్ని అందిస్తుంటుంది.

**ఎంచుకున్న కార్యక్రమాలు :**

1. ప్రామాణికమైన పుస్తక విధానము, క్రమబద్ధ నిర్వహణ
2. ప్రామాణికమైన నివేదికల విధానము, క్రమబద్ధ పర్యవేక్షణ
3. అంగీకరించిన లక్ష్యములు, ఆచరణ ప్రమాణములు, క్రమబద్ధ పర్యవేక్షణ
4. వ్యాపార, నిర్వహణకు సంబంధించిన నిధుల ఉమ్మడి విధాన రూపకల్పన
5. క్రమబద్ధమైన ఆడిట్, నిధుల రక్షణ పరిశీలన
6. క్రమబద్ధమైన ఎన్నికలు
7. సమర్ధవంతమైన స్వంత కార్యకర్తలు
8. నిరంతర విద్య, శిక్షణ
9. గ్రామసంఘం, మండల సమాఖ్య స్థాయిలో మహాసభ, ప్రాతినిధ్య మహాసభ, విధులు, బాధ్యతల స్పష్టత కల్పించుట

■

## కనిగిరిలో కనిపిస్తున్న మార్పు !

కనిగిరి నగర పంచాయితీలో 31 స్లం సమాఖ్యలు కలవు, ఈ స్లం సమాఖ్యలలోని స్వయం సహాయక సంఘ మహిళలు పొదుపు, అప్పుల వంటి ఆర్ధిక కార్యక్రమాలు సక్రమంగా నిర్వహిస్తున్నారు. ఈ దశలో యునిసెఫ్, ఏపిమాస్ ల సహకారంతో కనిగిరిని ఆదర్శ నగర పంచాయితీగా తీర్చిదిద్దే కృషి మొదలైఇ ముందడుగు వేస్తున్నది.

కనిగిరి నగర పంచాయితీలో నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత (వాష్)లకు సంబందించిన అంశాలు పరిశీలించి, పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన నగర పంచాయితీగా తీర్చిదిద్ద డానికి ఏపిమాస్ వివిధ రకాలుగా కృషి చేస్తున్నది. పట్టణంలో ఆరుబయట మలవిసర్జన లేకుండా చేయుటకు, ప్రజలు వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించేలా చేయడానికి యింటింటికి తిరిగి కుటుంబ సభ్యులను కలసి మాట్లాడుట, ప్రజల ఆలోచనలో, ప్రవర్తనలో మార్పుకొరకు, స్లం సమాఖ్యల మహిళాసంఘ సభ్యులతో సమావేశాలను నిర్వహిచడం జరుగు తున్నది. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణలో భాగంగా ప్రతిరోజు భోజనం చేసేముందు, చేసిన తరువాత, ఏదేని తినుబండారాలు చేతితో తీసుకొని తినేముందు, తిన్న తరువాత చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కొనుట, మూత్ర విసర్జన, మలవిసర్జన తరువాత కచ్చితంగా చేతులను సబ్బుతో కడుక్కొనుట. తడిచెత్త, పొడిచెత్త వేరుచేసి పారిశుధ్య కార్యక్రమాలకు సహకరించుట వంటి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నది.

**మార్పు:-**

ఈ అవగాహన కార్యక్రమాలు చేపట్టుట ద్వారా ప్రస్తుతం ఈస్లంసమాఖ్యలులో గల స్వయం సహాయక సంఘ మహిళలు ఆర్ధిక కార్యక్రామాలు నిర్వహణ కాకుండా వ్యక్తిగత, మరియు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం యిస్తుండడం విశేషం! ప్రతిరోజు భోజనం ముందు, తరువాత, ఏదేని తినుబండారాలు తినేముందు, తిన్న తరువాత, మూత్ర విసర్జన, మలవిసర్జన తరువాత ఖచ్చితంగా చేతులను సబ్బుతో కడుక్కుంటున్నారు. తడిచెత్త పొడిచెత్త వేరుచేసి పారిశుధ్య కార్యక్రమాలకు సహకరిస్తున్నారు.

■

గతాన్ని తప్పుకోవడం అవివేకం, ఎందుకంటె మనమిప్పుడు గతంలో లేము

# మహిళా రైతులకు 'ధీశాలి' ధీమా, 'ఆజీవ' అండ !

**తె**లంగాణాలోని యాదాద్రి జిల్లాలో ఆజీవ ప్రాజెక్టు క్రింద గ్రామీణ మహిళా మండలి, పీస్ సంస్థల భాగస్వామ్యంలో 'ధీశాలి', 'ఆజీవ' మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్ పి సి లు) ఏర్పాటుకు, సుస్థిరాభివృద్ధికి ఏపిమాస్ తోడ్పాటు అందిస్తున్నది. ఆ సంస్థల ప్రగతి గురించి ఇటీవల 'ఈనాడు' దినపత్రిక ఒక వ్యాసం ప్రచురించింది. ఆ పత్రిక సౌజన్యంతో 'మహిళా సాధికారత' పాఠకులకు ఆ వ్యాసాన్ని అందిస్తున్నాము.

*వ్యవసాయం, అనుబంధ రంగాల్లో మహిళలు సమిష్టి కృషితో పని చేస్తే ఆర్థిక స్వావలంబన సాధించవచ్చు. ఇందుకు నిదర్శనం ధీశాలి, ఆజీవ మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థలు. 2018లో కార్యకలాపాలను ప్రారంభించిన ఈ సంస్థలు అనతికాలంలోనే మంచి ఫలితాలు సాధించాయి. ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ ఉపయోగకరమైన వస్తువులను విక్రయించి నికర ఆదాయాన్ని పెంచుకుంటూ రైతులకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయి.*

*– న్యూస్‌టుడే ... యాదగిరిగుట్ట పట్టణం, బొమ్మల రామారం, భువనగిరి పట్టణం*





**మ**హిళా రైతులకు గుర్తింపు, గౌరవంతో పాటు సాధికారత కల్పించడం, రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, టార్పాలిన్లు అందించడం, కర్షకులు పండించిన పంటలకు గిట్టుబాటు కల్పించేందుకు కొనుగోలు కేంద్రాల నిర్వహణే లక్ష్యంగా ఏర్పాటైంది. ధీశాలి మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థ (కంపెనీ) బొమ్మలరామారాం మండలం సోలిపేట గ్రామంలో గ్రామీణ మహిళా మండలి అధ్యక్షురాలు దూబల, జయలక్ష్మి (మాస్) మహిళా అభ్యుదయ సొసైటీ, నాబార్డు సహకారంతో ఈ సంస్థను ప్రారంభించారు.

**కార్యకలాపాలు**

సంస్థ సభ్యులైన మహిళా రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలను దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా సంస్థ ద్వారానే విక్రయిస్తున్నారు. అధిక దిగుబడులు సాధించడం, విత్తనాభివృద్ధికి శాస్త్రవేత్తలతో సూచనలు, సలహాలు అందిస్తున్నారు. ప్యారారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నారు. చీకటిమామిడి గ్రామంలో రైతులు కూరగాయలు, ఆకుకూరలు అమ్ముకునేం దుకు షెడ్లు ఏర్పాటు చేయనున్నారు. ఎరువులు, విత్తనాలనిల్వకు త్వరలోనే గోదాం నిర్మించనున్నారు. కోవిడ్ లాక్‌డౌన్ కాలంలో ఐదు లక్షల రూపాయలు వెచ్చించి కొన్నిరోజుల పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో నిత్యావసర వస్తువులు, కోడిగుడ్లు, మాస్కులను పేదలకు ఉచితంగా అందజేయడం విశేషం.

***ధీశాలి సంస్థ వివరాలు***

కంపెనీ ఆవిర్భావం : 17 సెప్టెంబరు 2018

మహిళ రైతు సభ్యులు : 402 మంది

మొత్తం రైతుల వాటా : రూ. 4.42 లక్షలు

ఒక్కొక్కరి వాటా : 1100 రూ.

నికర ఆదాయం : రూ. 24 లక్షలు (2018–20 మార్చి

**మహిళా రైతుల అభివృద్ధికి కృషి**

గ్రామీణ రైతులను అన్నివిధాలుగా అభివృద్ధి చెందాలనే





ఇబ్బందులు పడకుండా సాయం అందించి అండగా నిలిచారు. కంది పంట వేయ డానికి 235 రైతులకు సహకారం అందించి, 2525 క్వింటాళ్ళు కొను గోలు చేసి మద్దతు ధర కల్పించారు.

లక్ష్యంతోనే ఈ సంస్థను ఏర్పాటు చేశాం. మాస్, నాబార్డు సహకారంతో కార్యకలాపాలు కొనసాగిస్తున్నాం. మధ్య దళారీ వ్యవస్థను లేకుండా చేసి, మహిళా రైతులు ఆర్థికాభి వృద్ధి సాధించేలా ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నాం.

**– దూబల విజయలక్ష్మి, అధ్యక్షురాలు, బొమ్మల రామారం**

**కంపెనీ బోర్డు సభ్యులు**

అధ్యక్షురాలు : పల్లె మంజుల, తిమ్మాపురం, ఉపాధ్యక్షురాలు :వరలక్ష్మి, చీకటిమామిడి, బోర్డు డైరక్టర్లు : పది మంది

## కర్షకులకు అండగా ఆజీవ

**మ**హిళా రైతులకు సమాన హక్కులు కల్పించడం, అతివలు ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పాటు అందించాలనే ఆలోచనల నుంచి పుట్టిందే అజీవ మహిళా రైతు ఉత్పత్తి దారుల సంస్థ (కంపెనీ) తొలి ప్రయత్నంగా కార్యకలాపాలను యాదగిరిగుట్ట మండలం, సాదువెల్లిలో ప్రారంభించింది. పదిగ్రామాల మహిళా రైతులు సభ్యులుగా ఉన్నారు.

**కార్యకలాపాలు ..**

నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, సంచులు, టార్పాలిన్లను రైతులకు అమ్మడమే కాకుండా క్షేత్రాల వద్దే పంటలను ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోలు చేస్తూ వ్యాపారం చేస్తున్నారు. సేంద్రియ ఎరువులతో సాగు కొనసాగేలా ప్రోత్సహిస్తున్నారు. చిరుధాన్యాలు పండించేలా కృషి చేస్తున్నారు. వ్యవసాయ నిపుణులతో రైతులకు సూచనలు అందిస్తున్నారు. లాభాల్లో మహిళలకు వాటాల రూపంలో పంపిణీ చేసుకోవడానికి సన్నద్ధమవుతున్నారు. వీరికి పీఎస్ స్వచ్ఛంద సంస్థ ఏపీ మహిఅభివృద్ధి సంస్థ మణికొండ, నాబార్డు, నల్లగొండ వారు సహకారం అందిస్తున్నారు. కరోనా సమయంలో రైతులు

**రైతులకు మద్దతుగా నిలుస్తున్నాం...**

ప్రస్తుతం పది గ్రామాల్లో మా కంపెనీ రైతులకు తోడ్పాటు అందిస్తోంది. విత్తనాలు, ఎరువులు అందజేయడమే కాకుండా పంటలు కొనుగోలు చేసి మద్దతుగా నిలుస్తున్నాం. ప్రధానంగా సేంద్రియ ఎరువులు వాడేలా చిరుధాన్యాలు ఎక్కువగా వేసుకొనేలా ప్రోత్సహిస్తున్నాం.

***– గుజ్జుక ఎల్లూబాయి, అధ్యక్షురాలు, నాదువెల్లి***

**మహిళా రైతులను గుర్తించేలా...**

వ్యవసాయంలో పురుషులతో పాటు సమానంగా మహిళలు పని చేస్తారు. కానీ గుర్తింపు దక్కడం లేదు. అతివలకు గుర్తింపు కావాలనే లక్ష్యంతోపాటు, అందుబాటులో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పరికరాలు, సౌకర్యాలు కల్పిస్తూ కంపెనీ ఎంతో మేలు చేస్తోంది. ధరలు లేనపుడు నష్టపోకుండా రైతులకు అండగా ఉంటున్నారు. ఈ కంపెనీలో సభ్యులుగాచేరినందుకు సంతోషంగా ఉంది.

***– కొక్కలకొండ స్వరూప, రైతు, చొల్లేరు***

***అజీవ సంస్థ వివరాలు***

కంపెనీ ఆవిర్భావం : 27 సెప్టెంబరు 2018
మహిళ రైతు సభ్యులు : 535 మంది
మొత్తం రైతుల వాటా : రూ. 5.35 లక్షలు
ఒక్కొక్కరి వాటా : 1000 రూ.
నికర ఆదాయం : రూ. 26 లక్షలు (2018–20 మార్చి)

**కంపెనీ బోర్డు సభ్యులు**

అధ్యక్షురాలు: గుజ్జుక ఎల్లూబాయి, సాదువెల్లి ;ఉపాధ్యక్షురాలు: స్వరూప, చొల్లేరు ; బోర్డు డైరక్టర్లు : పది మంది. ■

**కంటికి కన్ను అనే ప్రతీకార జ్వాల అందరినీ అంధులను చేస్తుంది; కేవలం గుడ్డి ప్రపంచం మిగులుతుంది**

# సుబాబుల్ సాగులో మెళకువలు

సుబాబుల్ వృక్షం మూలాలు దక్షిణ మెక్సికో, ఉత్తర మధ్య అమెరికాకు సంబంధించినవి. కానీ ఈ చెట్టు ఇప్పుడు అన్ని ఉష్ణ మండల ప్రాంతాలలో సహజసిద్ధంగా పెరుగు తుంది. ఈ చెట్టుకి పూసే పువ్వులు తెల్లని కేసరములతో తల వలె గుండ్రంగా ఉంటాయి. దీనిని వంట చెరకుగా, నారగా, పశువుల మేతగా ఉపయోగిస్తారు. ఇది అతిత్వరగా పెరిగే బహువార్షిక మొక్క. దీని కలప పనిముట్లకు



ఉపయోగిస్తారు. కాగితపు గుజ్జు లాంటి అవసరాలను కూడా తీర్చగలదు. విత్తనాలలో 24 శాతం మాంసకృత్తులు కల్గి ఉంటాయి. విత్తనాలు సులభంగా మొలకెత్తుతాయి. వర్షాభావ పరిస్థితుల్లో కూడా బాగా పెరుగుతుంది. గాలిలో ఉన్న నత్రజనిని ఉపయోగించుకునే శక్తి గల బ్యాక్టీరియాను వేరు బుడిపెలందు కలిగి ఉంటుంది. ఎక్కువసార్లు పిలకపంట తీసుకోవచ్చు. ఉష్ణమండలాల్లో బాగా పెరుగుతుంది. వర్షపాతం 600–1700 మీ.మీ. ఉన్న ప్రాంతాల్లోనూ, మన రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లోనూ బాగా పెరుగుతుంది.

**నేలలు**

అన్ని రకాల తటస్థ నేలల్లో పెరుగుతుంది. క్షార, ఆమ్ల నేలల్లో పెరగదు. లోతైన, సారవంతమైన, ఎక్కువ తేమ లభ్యమయ్యే నేలలు అనుకూలమైనవి. బంజరు భూముల్లోను, చెరువు గట్లపైన, పశువుల తాకిడి లేని కాలువ గట్లపైన, పొలాల గట్లపైన పెంచవచ్చు. అటవీ వ్యవసాయంగా పంట పొలాల్లో కూడా పెంచవచ్చు.

**నారు మొక్కల పెంపకం**

రెండు సంవత్సరములు ఆపై బడిన చెట్ల నుండి విత్తనాలను సేకరించాలి. ఒక కిలోకు 16 వేల 20 వేల విత్తనాలుంటాయి. విత్తన శుద్ధికి గాను ఈ విత్తనాలను సుమారు 30 డిగ్రీల సెల్సియస్ వేడినీటిలో 5 నిమిషాలు ఉంచి, తీసిన విత్తనాన్ని చల్లని నీటిలో 12 గంటలు నానబెట్టి విత్తుకోవాలి. విత్తన శుద్ధి తర్వాత నారుమళ్ళలో నేరుగా విత్తడానికి వరుసల మధ్య 20 సెంటీమీటర్ల వరుసలో 4 సెంటీ మీటర్ల దూరంలో 1.5 సెంటీమీటర్ల లోతుగా విత్తనాలు విత్తుకోవచ్చు. లేదా 22– 10 సెంటీమీటర్ల పాలిథీన్ సంచుల్లో పేడ, ఎరువులను కలిపిన మట్టిని నింపి ఒక సంచికి 2 విత్తనాలు చొప్పున విత్తుకోవాలి. ఈ విత్తనాలను మార్చి, ఏప్రిల్‌లో విత్తినట్లయితే జులైకల్లా మొక్కలు నాటటానికి తయారవుతాయి.

**నాటే పద్ధతి – అంతర పంటలు**



వేసవిలో 30 ఘ.సెం.మీ పరిమాణం గల గుంతలను త్రవ్వితే నేల గుల్లబారి మొక్క నాటటానికి అనువుగా ఉంటుంది. వర్షాకాలం ప్రారంభంలోనే మట్టి నింపిన



గుంతల్లోను, సంచుల్లోను మొక్కలను నాటాలి. మొక్కల మధ్య దూరం 2 మీటర్లుగాని 1.5 మీటర్లు గాని ఉంచాలి. ఎకరాకు 666 నుండి 1000 మొక్కల వరకు నాటుకోవచ్చు. మొదటి సంవత్సరం మొక్కల మధ్య అంతర సాగు చేయాలి. మొదటి సంవత్సరం పప్పుదినుసు జాతి పైర్లను అంతర పంటలుగా లాభసాటిగా పెంచుకోవచ్చు. రెండవ సంవత్సరం నుండి పశుగ్రాస పైర్లను పెంచుకోవచ్చు.

**యాజమాన్య పద్ధతులు**

కలుపు నివారణ మొదటి 2 సంవత్సరముల వరకు చేయాలి. అవసరాన్ని బట్టి 2 నుండి 5 సంవత్సరాల మధ్య చెట్లను నరకవచ్చు. వంటచెరుకు కయితే 2 నుంచి 3 సంవత్సరముల మధ్య నరకవచ్చు. పశుగ్రాసానికయితే ప్రతి 2 నుంచి 3 నెలలకు 10 నుంచి 15 సెంటీమీటర్ల ఎత్తులో నరకాలి. కాగితపు గుజ్జుకయితే 4 నుంచి 5 సంవత్సరముల మధ్య నరకవచ్చు. చెట్ల ప్రక్క కొమ్మలను ఎప్పటికప్పుడు నరికి చెట్లు ఎత్తుగా పెరిగేటట్లు చేస్తే 10 నుంచి 15 సంవత్సరముల వరకు కలప ఉత్పత్తి అవుతుంది.

**దిగుబడి**

సుబాబుల్ 6 సంవత్సరములలో 20 మీటర్ల ఎత్తు వరకు పెరుగుతుంది. వర్షాధార ప్రాంతాల్లో సాధారణంగా కలప దిగుబడి ఎకరాకు సంవత్సరానికి 4 నుంచి 8 ఘ.మీ వస్తుంది. నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో ముఖ్యంగా ప్రకాశం జిల్లాలో 2 నుండి 3 రెట్లు అధికంగా కలప దిగుబడి వస్తుంది. పశు గ్రాసం ఎకరాకు వర్షాధార ప్రాంతాల్లో 5 నుంచి 10 టన్నులు, నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో 32 నుంచి 36 టన్నులు వస్తుంది.

**ఉపయోగాలు**

కలప గట్టిగా నాణ్యంగా ఉంటుంది. భవన నిర్మాణానికి, ఫర్నీచర్ తయారీకి ఉపయోగపడుతుంది. గుంజలు, కంచె స్థంభాలుగా ఉపయోగపడతాయి. కొమ్మలు వంటచెరకుగా పనికివస్తాయి. ఆకులు పశుగ్రాసంగా ఉపయోగపడతాయి. మొక్కలను 8 మీటర్ల ఎడంగా రెండు ఉమ్మడి వరుసల్లో (వరుసల మధ్య దూరం 60 సెంటీమీటర్లు) నాటి, భూమి నుండి 30 సెంటీమీటర్ల ఎత్తుకు వస్తే ఎకరాకు 0.8 టన్నుల వరకు ఎండుమేత, అర టన్ను వంటచెరకు లభిస్తాయి. సుబాబుల్‌ను పచ్చిరొట్టగా ఉపయోగిస్తే ఖరీదైన నత్రజని ఎరువులపై ఆధారపడడం తగ్గించవచ్చు.

పచ్చిరొట్టగా ఉపయోగిస్తే ఎకరాకు 8 నుంచి 12 కిలోల నత్రజని లభిస్తుంది. అంతరపంటగా నత్రజని అవసరాన్ని 50 శాతం తగ్గించవచ్చు. కాగితం తయారీకి



కావలసిన శ్రేష్ఠమైన గుజ్జు సుబాబుల్ నుండి లభిస్తుంది.

**సంరక్షణ**

పశుగ్రాసానికి పనికి వస్తుంది కనుక మొదటి సంవత్సరంలో మొక్కలను పశువులు, మేకల బారి నుండి కాపాడాలి. లేత ఆకుల్లో మైమోసిన్ అనేది ఎక్కువగా ఉండటం వలన సుబాబుల్ ఆకులను వేరే పశుగ్రాసంతో కలిపి మేపుకోవాలి. ఈ చెట్లకు సహజ పునరుత్పత్తి ఎక్కువగా ఉండటం వలన చివరకు కలుపు మొక్కలుగా మిగలవచ్చు. దీన్ని నివారించడానికి తరచు అంతరకృషి చేయాలి. ■

# దివ్యాంగులకు చక్రాల కుర్చీలు, డిజిటల్ టాబ్లెట్లు



దివ్యాంగుల సేవా సంస్థ 'కమిట్‌మెంట్స్' జులై 31 వ తేదీన హైదరాబాదులోని సరూర్ నగర్ లో 21 మంది దివ్యాంగ బాలలకు చక్రాల కుర్చీలను, 10 డిజిటల్ టాబ్లెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. తెలంగాణా విద్యాశాఖ మంత్రి శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని దివ్యాంగ బాలలకు కమిట్‌మెంట్స్ తరపున చక్రాల కుర్చీలను, డిజిటల్ టాబ్లెట్లను పంపిణీ చేసినట్లు కమిట్‌మెంట్స్ వైద్యులు డాక్టర్ సి చంద్రశేఖర్ తెలియజేశారు. మలేసియాకు చెందిన సోమ్‌గ్రిమ్ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమూర్తి వీటిని సమకూర్చినట్టు ఆయన తెలియజేశారు.

గత రెండు దశాబ్దాలుగా కమిట్‌మెంట్స్ మారుమూల గ్రామాలలో, పట్టణ మురికివాడలలోని పేద దివ్యాంగులకు సాధికారత కల్పించడంకోసం, వారికి అవసరమైన తోడ్పాటు అందించడంకోసం అమోఘమైన సేవ చేస్తున్నదని శ్రీమతి ఇంద్రారెడ్డి కొనియాడారు. కమిట్‌మెంట్స్ సంస్థ డిజిటల్ లైబ్రరీ నిర్వహించడానికి ప్రాంగణాన్ని సమకూరుస్తానని ఆమె హామీ యిచ్చారని ఆయన తెలిపారు. దివ్యాంగులకు ఉద్యోగావకాశాలను మెరుగుపరచడంకోసం వారికి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించవలసిందిగా కమిట్‌మెంట్స్ ను మంత్రి కోరారు.

సోమ్‌గ్రిమ్ సంస్థ తరపున డాక్టర్ ఏ రామలింగారెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కమిట్‌మెంట్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ శ్యామసుందర్ నాయకత్వంలోని పట్టణ బృందం ఈ మొత్తం కార్యక్రమాన్ని నిర్వహించింది. ■

## పాత పత్రికలతో సరికొత్త వైజ్ఞానిక సందేశం

**(8 వ పేజీ తరువాయి)**

మనుమరాండ్రను కూడా ప్రేరేపిస్తే వారు అల్లరి చిల్లర తిరుగుళ్ళు తిరక్కుండా ఒక విజ్ఞానాత్మక కాలక్షేపాన్ని అలవరచుకుని మంచిపౌరులుగా తయారవుతారు కదా అని ఆయన అంటారు. పంచాయతీలు, మునిసిపాలిటీలవంటి గ్రామ, పట్టణ పాలనాయంత్రాంగాలు కూడా ఈ విధమైన సత్కాలక్షేపాన్ని ప్రోత్సహిస్తూ గ్రామాలు, పట్టణాలలోలోక గదిని, పత్రికలు మొదలైనవాటిని కేటాయించి, ' పునర్వినియోగ వనరుల కేంద్రాలను' ఏర్పాటుచేయాలని ఆయన సూచించారు. తన కాలాన్ని, శక్తిసామర్థ్యాలను ఇలా పూర్తిగా సామాజిక సేవలకు వినియోగిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్ ఎంతైనా అభినందనీయులు. ఆయన సూచించిన మార్గాన్ని అనుసరించడం మంచి వ్యక్తిత్వమనిపించుకుంటుంది. ■

ఆనందం ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎంతైనా సర్వ సిద్ధంగా దొరికేది కాదు; నీ చేతలతో నీవే రూపుదిద్ద వలసినది

# మూడు అమృతాలతో సాగే ప్రకృతి వ్యవసాయం !

ప్రకృతి వ్యవసాయంలో మూడు విధాల అమృతాలు అవసరం. అవి: బీజామృతం, ఘనామృతం, జీవామృతం.. వీటికి ఆవు మూత్రాన్ని, పేడను వినియోగించవచ్చు.

- బీజామృతం: విత్తన శుద్ధి.కి 20 లీటర్ల నీరు, ఐదు లీటర్ల ఆవు మూత్రం, ఐదు కేజీల ఆవు పేడ మిశ్రమాన్ని కలిపి రాత్రంతా వుంచి తదుపరి రోజు విత్తనాలను శుద్ధిచేసి నాటినట్లయితే అధిక శాతం మొలకెత్తుతాయి.
- ఘనామృతం : ఆవు పేడతో దీన్ని తయారు చేసుకోవచ్చు. 200 కేజీల ఎండిన ఆవు పేడ జల్లిడ పట్టి దీనిలో 200 లీటర్ల ఆవు మూత్రం కలిపి ఎండ బెట్టి నిల్వ చేసుకోవాలి. ఈ ఘనామృతాన్ని చివరి దుక్కిలో పంట కాపు దశలో పంటకు వినియోగిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు.
- జీవామృతం: ఆవు మూత్రంతో తయారు చేసేది. 200 లీటర్ల ఆవు మూత్రం ఒకటి రెండుసార్లు సాగు నీటితో పాటు పంటలకు అందించాలి. పంటలకు నాలుగు నుంచి ఐదుసార్లు జీవామృతం పిచికారి చేయాలి. దీంతో చీడ పీడలను నివారించుకోవచ్చు. 200 లీటర్లలో ఐదు నుంచి పది లీటర్లు గో మూత్రం, పది కేజీల ఆవు పేడ, ఒక కేజీ బెల్లం, ఒక కేజీ పప్పుల పిండి, పిడెకెడు పుట్ట మన్నుతో వీటిని కలిపి 48 గంటలు నిల్వ చేయాలి.
- ద్రవ, ఘన జీవామృతాలు పంటలకు వినియోగించటం వలన నత్రజని పుష్కలంగా లబిస్తుంది. ఫాస్పేట్ నేలలో పుష్కలంగా వుంటుంది. పొటాష్ కూడా ఇదే రకంగా మొక్కలకు అందుతుంది. జీవద్రవ్యం కూడా భూమిలో పెరగటం వలన మొక్కల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జీవామృతం వలన భూమిలోని వానపాములు సంచరించటం పెరుగుతుంది. దీని వలన భూమి 15 అడుగుల లోతు వరకు రంధ్రాలు ఏర్పడతాయి. కురిసిన వర్షం పూర్తిగా భూమిలోకి ఇంకుతుంది.
- 200 లీటర్ల నీటిలో 50 లీటర్ల గో మూత్రం, ఐదు లీటర్ల పుల్లటి మజ్జిగ కలిపి పంటలకు పిచికారి చేసినట్లయితే వైరెస్ వంటి ప్రమాదకర తెగుళ్లను నివారించవచ్చు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌లో విక్రయించవద్దు. రైతులే ప్రత్యేక మార్కెట్‌ను రైతులు రూపొందించుకోవాలి.
- ఒక ఎకరంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా రూ.6 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు ఆదాయం ఆర్జించవచ్చు. యాపిల్, ద్రాక్ష, స్ట్రాబెరి వంటి పంటలకు కూడా ఆంధ్రప్రదేశ్ అనుకూలం.
- ఇలాంటి ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ వుంది. అధిక రేట్లు లభిస్తున్నాయి. రైతుబజారుల్లో ఇలాంటి ఉత్పత్తులను అమ్ముకొనే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించాలి. శాసనసభ, శాసన మండలిలో కూడా ప్రకృతి వ్యవసాయంపై నిర్మాణాత్మక చర్చ జరగాలి.
- భూమిలో జీవన ద్రవ్యం (హ్యూమస్) మొక్క రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. జీవనద్రవ్యం ప్రకృతి వ్యవసాయం వల్ల భూమిలో పెరుగుతుంది. ప్రకృతి వ్యవసాయ విధానంలో అంతర్ పంటలు సాగు చేయాలి. ఒక దేశీయ ఆవు నుంచి వచ్చే పేడ, మూత్రం ద్వారా ఎకరాల్లో పంటలను సాగు చేయవచ్చు. చీడ, హైబ్రీడు, జర్మనేషన్ విత్తనాలు కన్నా దేశీయ విత్తనాలే మేలు. దేశీయ విత్తనాలు అందుబాటులో లేకపోయినా సంకర విత్తనాలను దేశీయ విత్తనాలుగా మార్చుకొనే అవకాశం వుంది. ప్రకృతి వ్యవసాయంలో సాగు నీరు, విద్యుత్ శాతం ఆదా అవుతుంది. ఇలా పండించిన పంటలు ఆరోగ్యకరంగా వుంటాయి. పల్లెలు ఆర్థికాభి వృద్ధిని సాధిస్తాయి. పట్టణాలకు రైతుల వలసలను, ఆత్మహత్యలను నిరోధించవచ్చు.

**అడ్డంకులు ఆశా జీవిని మరింత శక్తి మంతుణ్ణి చేస్తాయి, నిరాశాజీవిని అవే నీరుగారుస్తాయి**

# ద్విదశ వార్షికోత్సవ ఏపిమాస్‌కు ప్రముఖుల అభినందనలు

## తెలంగాణా గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ సందేశం

**లా**భార్జన దృష్టిలేని జాతీయ స్థాయి వనరుల సంస్థ 'ఏపిమాస్' (మహిళాభివృద్ధి సొసైటీ) ఆవిర్భవించి 20 వసంతాలు పూర్తిచేసుకున్నదని తెలిసి సంతసిస్తున్నాను.

గత 20 ఏళ్ళుగా వివిధ రంగాలలో మీ సంస్థ చేస్తున్న విశిష్టమైన కృషికి, మహిళలు, రైతులు, సామాజిక బడుగువర్గాల ప్రజా సంస్థల బలోపేతానికి, వారు సుస్థిరాభివృద్ధిని, సమ్మిళిత ప్రగతిని సాధించడానికి అందిస్తున్నతోడ్పాటును నేను అభినందిస్తున్నాను.

మీరు భవిష్యత్‌లో అందించబోయే సేవలు, సామర్థ్యం పెంపుదల కార్యక్రమాలకు కార్యాచరణ ప్రణాళికతో కూడిన విజన్ 2030 రూపొందిస్తున్నారని తెలిసి సంతోషిస్తున్నాను.

ప్రభుత్వాలు, ఎన్ జి ఓ లు, బ్యాంకులు, అంతర్జాతీయ సంస్థల వంటి మీ కీలక భాగస్వాములలో, సహకరించే సంస్థలలో ప్రతిష్ఠాత్మక స్థానం పొందుతూ మీరు సాగిస్తున్న కృషిని , కోవిడ్ కల్లోలంలో బాధితులకు మీరు అందించిన తోడ్పాటును నేను ప్రత్యేకంగా అభినందిస్తున్నాను.

ప్రజల సేవలోను , మీ అవిశ్రాంత కృషిద్వారా ఆత్మనిర్భర భారత్ ను సాకారం చేయడంలోను రాబోయే రోజులు మీకు ఫలప్రదంగా, ప్రయోజనాత్మకంగా వుండాలని నేను ఆశిస్తున్నాను.

ద్విదశ వార్షికోత్సవ సంరంభ సందర్భంగా మీ అందరికి నా ప్రత్యేక అభినందనలు, దేశ సేవలో మీరు ఇతోధికంగా కృషిచేస్తారని ఆశిస్తాను.

శుభాభినందనలు

**– డాక్టర్ తమిళిసై సౌందరరాజన్**

---

## తెలంగాణా వ్యవసాయ మంత్రి శ్రీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సందేశం

**మీ** ప్రతిష్ఠాత్మక సంస్థ మహిళాభివృద్ధి సొసైటీ (మాస్) కోవిడ్ మహమ్మారి చెలరేగిన సమయంలో చేపట్టిన కార్యక్రమాలకు ముందుగా నా అభినందనలు. మహిళాభివృద్ధి సొసైటీ (మాస్) అనే ఎన్ జి ఓ మహిళలు, రైతులు, బడుగువర్గాల ప్రజల జీవితాలను మెరుగుపరచడానికి నిర్విరామంగా కృషిచేస్తున్నది. ' మహిళా సాధికారత ' పత్రిక ఎంతో చక్కని సమాచారాన్ని అందిస్తున్నది. ఈ పత్రికలోని విషయాలు లక్షిత లబ్ధిదారుల జీవితాలలో మార్పుతేగలవని నేను దృఢంగా విశ్వసిస్తున్నాను.


ఉత్పత్తిదారుకు, మార్కెట్‌కు మధ్యవున్న అంతరాన్ని ఎఫ్ పి ఓ ల కృషి ద్వారా పూరించడానికి ఏపిమాస్ భాగస్వాములు చూపిస్తున్న అంకితభావం ఎందరికో ఆశాకిరణంగా, ఆనందదాయకంగా మారింది. ఏపిమాస్ తెంపులేకుండా చేపట్టే సామర్థ్యం పెంపుదల శిక్షణలు వీరి అవగాహన పెంపుదలకు తోడ్పడుతున్నాయి.

ఎస్ హెచ్ జి లను స్వయంసమృద్ధంగా, సుస్థిరాభివృద్ధియుతంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో తెలంగాణాలో ఏపిమాస్ నిర్వహిస్తున్న పాత్రను నేను స్వాగతిస్తున్నాను. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) తో కలసి కామారెడ్డిలో సహభాగ విధానంలో మాస్ ఒక ప్రయోగాత్మక ప్రాజెక్టును చేపట్టింది.

ఏపిమాస్ ప్రోత్సాహంతో రైతులకు, మహిళలకు ఉజ్వల భవిష్యత్తు చేకూరాలని ఆశిస్తున్నాను. ఎంతో ఆర్ద్రతతో మీరు సాధించిన ఈ విజయం పట్ల మీకు నా అభినందనలు.

**– ఎస్. నిరంజన్ రెడ్డి**

సానుకూల ధోరణిలో అర్థంచేసుకునే స్వభావం వుంటే, కష్టమైనా, సుఖమైనా ఆనందమే



नाबार्ड
అభివృద్ధి
కోసం
పారిశుధ్యం
నాబార్డు సౌజన్యంతో
చిరు ప్రయత్నం, గొప్ప ప్రగతి
స్వచ్ఛత ఉద్యమం
నీళ్ళ ట్యాంకు మరియు రెండు గుంతల మరుగుదొడ్డి
దీర్ఘ కాలం అందించెను మీకు సేవలు
गाँव बढ़े >> तो देश बढ़े
www.nabard.org
YouTube /nabardonline
Taking Rural India >>Forward

MAHILA SADHIKARATHA
Publication Date: 01-08-2021; Posting Date: 05 & 06-08-2021
RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2021-23

## 20 వ వార్షికోత్సవ సంరంభంలో మరికొన్ని పదనిసలు !








జ్యోతి ప్రజ్వలన : మరికొన్ని దృశ్యాలు .... ప్రార్థన , దేశభక్తి , స్ఫూర్తి దాయక గీతాలాపన: జె విజయలక్ష్మి , జి శ్రీనివాస్, ఓంకార్






ఏపిమాస్ కార్యక్షేత్రాలలో 20 వ వార్షికోత్సవాలు : మదనపల్లిలో ... , గుత్తిలో ...





కామారెడ్డిలో , కర్నూలులో , బీహార్ లో ...







20 వ వార్షికోత్సవం సందర్భంగా ప్రచురించిన ప్రచురణల ఆవిష్కరణ







ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089